

# సూర్య

నేటి దినపత్రిక

www.suryaa.com

## కరీంనగర్

పెద్దపల్లి, జగిత్యాల, రాజన్నసిరిసిల్ల

గురువారం 4 ఏప్రిల్ 2024 13 పేజీలు


## అభ్యర్థి ప్రకటనకు




# ఎందుకు ఇంత ఆలస్యం

- సామాజిక సమీకరణాలే ముఖ్య కారణమా..??
- సర్వేలు ఎవరివైపు ఉన్నాయి..??
- ఇతర స్థానాలతో కరీంనగర్‌కు ఏమి సంబంధం..??
- కార్యకర్తల మనసులో ఎన్నో సందేహాలు..







**సూర్య కరీంనగర్ ప్రతినిధి**

**బోనాల వెంకటేశ్**

కరీంనగర్ పార్లమెంట్ స్థానానికి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఎంపిక అధిష్టానానికి కత్తిమీద సాములాగా తయారయింది. ఆశావహులు ఉన్న కాని అభ్యర్థి ప్రకటన ఎందుకు ఆలస్యం అవుతుందని కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల మనసులో ఎన్నో సందేహాలు వ్యక్తమవుతున్నాయి. నేడు.. రేపు అభ్యర్థి ప్రకటన అంటూ అధిష్టానం ఆశావహులను, నాయకులను, కార్యకర్తలను ఉత్కంఠకు గురి చేస్తుంది. ప్రధాన ఆశావహులు అయిన మాజీ ఎమ్మెల్యే అల్గిరెడ్డి ప్రవీణ్ రెడ్డి, పార్టీ సీనియర్ నాయకుడు వెలిచాల రాజేందర్‌రావు ఎవరికి వారే పార్టీ టికెట్ తనకే వస్తుందని అనుచరులకు తెలపడంతో జిల్లా పార్టీలో తీవ్ర చర్చకు దారితీస్తుంది. కాంగ్రెస్ అధిష్ఠానం సర్వేల ప్రకారం ఎవరికైతే ఎక్కువ ప్రజల మద్దతు ఉందో వారికే టికెట్ కేటాయిస్తుందని మొదటి నుండి చెబుతున్నారు. పార్టీ టికెట్ కేటాయించడం విషయంలో ముఖ్యంగా సామాజిక సమీకరణాలు అడ్డు వస్తున్నాయని తెలుస్తుంది. ఇప్పటివరకు ప్రకటించిన పార్లమెంటు స్థానాలు సామాజికపరంగా ఒకే వర్గానికి ఎక్కువగా సీట్లు కేటాయించడంతో కరీంనగర్ స్థానానికి టికెట్టు ఇతర మిగిలిన ప్రకటించని స్థానాల అభ్యర్థుల మీద ఆధారపడి ఉందని తెలుస్తుంది. ఇలా కరీంనగర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఎంపిక చాలా ప్రశ్నలకు ముడిపడి ఉంది. ఏది ఏమైనా టికెట్ ప్రకటన ప్రజల్లో, కార్యకర్తల్లో, పార్టీలో తీవ్ర చర్చకు దారి తీసింది.

## నేర, చట్ట వ్యతిరేక కార్యకలాపాల

# నియంత్రణ కోసం "ఆపరేషన్ గరుడ"

- రామగుండం పోలీస్ కమిషనర్ ఎం. శ్రీనివాస్

- పెద్దపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో "ఆపరేషన్ గరుడ" ప్రారంభం

- డ్రోన్‌లతో పట్టణంలో పెట్రోలింగ్..



**సూర్య పెద్దపల్లి ప్రతినిధి**

నేర, చట్ట వ్యతిరేక కార్యకలాపాల నియంత్రణ కోసం "ఆపరేషన్ గరుడ"ను ప్రారంభించామని రామగుండం పోలీస్ కమిషనర్ ఎం. శ్రీనివాస్ తెలిపారు. బుధవారం రామగుండం పోలీస్ కమిషనర్ ఎం. శ్రీనివాస్ పెద్దపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఆపరేషన్ గరుడ పేరుతో డ్రోన్ పెట్రోలింగ్ ప్రారంభించారు. ఈసందర్భంగా సీపీ మాట్లాడుతూ... అసాంఘీక శక్తుల నిర్మూలనకు, నేరాల నియంత్రణ, ప్రజల భద్రత, లా అండ్ ఆర్డర్ దృష్ట్యా పెద్దపల్లిలో (మిగతా 2లో)



# నత్త నడకన రాజారాంపల్లి బ్రిడ్జి నిర్మాణం

- బ్రిడ్జి నిర్మాణం సరే విద్యుత్ తీగల పరిస్థితి ఏంటి
- కాంట్రాక్టర్,విద్యుత్ అధికారుల మధ్య కొరవడిన సమన్వయం
- వర్షాకాలంలోపు బ్రిడ్జి నిర్మాణం పూర్తయ్యేనా??

**సూర్య ఎండపల్లి**

2లో



# ఎట్టకేలకు పెద్దపల్లి పార్లమెంట్ సెగ్మెంట్ ఎమ్మెల్యేల ఐక్యత రాగం

- కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వంశీకృష్ణ గెలుపుకు అందరూ కృషి చేయండి
- రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

**సూర్య-గోదావరిఖని:**

అధికార కాంగ్రెస్ పార్టీకి చెందిన పెద్దపల్లి పార్లమెంట్ సెగ్మెంట్ ఎమ్మెల్యేలు, మంత్రి శ్రీధర్ బాబు ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ విషయంలో మొదట కొంత వ్యతిరేక భావంతో ఉన్నప్పటికీ ఎట్టకేలకు ఐక్యత రాగాన్ని ఆలపించారు. ఈ మేరకు బుధవారం హైదరాబాద్ బేగంపేటలోని మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు నివాసంలో మంత్రి శ్రీధర్ బాబుతో పాటు, పెద్దపల్లి పార్లమెంట్ సెగ్మెంట్ పరిధిలోని ఎమ్మెల్యేలు అందరూ కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో శ్రీధర్ బాబు మాట్లాడుతూ దివంగత కాంగ్రెస్ పార్టీ సీనియర్ పార్లమెంటేరియన్ కాకా వెంకటస్వామిని ఆదర్శంగా తీసుకొని రాజకీయాల్లోకి వచ్చిన గడ్డం వంశీకృష్ణను అఖండ మెజారిటీతో గెలిపించాలని కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో పాటు ప్రజలను కోరడం కనిపించింది. అసలు విషయానికి వస్తే కాంగ్రెస్ పార్టీ పెద్దపల్లి ఎంపీ అభ్యర్థిగా

(మిగతా 2లో)



# సూర్య కథనానికి స్పందన

- కార్యదర్శికి మెమో జారి

**సూర్య మల్లాపూర్**

సూర్య ఎఫెక్ట్

మండలంలోని ఓబులాపూర్ గ్రామంలో త్రాగు నీటి సౌకర్యం కల్పించాలంటూ తండా వాసులు ఆందోళనకు దిగిన నేపథ్యంలో సూర్య దినపత్రికలో బుధవారం ప్రచురితమైన (మిగతా 2లో)



# నత్త నడకన రాజారాం పల్లి బ్రిడ్జి నిర్మాణం

**- బ్రిడ్జి నిర్మాణం సరే విద్యుత్ తీగల పరిస్థితి ఏంటి - కాంట్రాక్టర్,విద్యుత్ అధికారుల మధ్య కొరవడిన సమన్వయం**

**- వర్షాకాలం లోపు బ్రిడ్జి నిర్మాణం పూర్తయ్యేనా??**

**సూర్య ఎండపల్లి**

మండలంలోని రాజారంపల్లి పాత గూడూరు మధ్య ఉన్న బ్రిడ్జి నిర్మాణ పనులు నత్త నడక సాగుతున్నాయి. కంట్రాక్టర్ నిర్లక్ష్యం తో పూర్తి కావలసిన బ్రిడ్జి పనులు ఇప్పటికీ పూర్తి కాలేదు. అసలే రాబోయేది వర్షాకాలం. బ్రిడ్జి నిర్మాణం పూర్తి కాకపోతే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తుంది. బ్రిడ్జి నిర్మాణం తో లోలేవల్ వంతెన నిర్మాణం ఉన్న ప్రదేశం విద్యుత్ లైన్ లు ఎత్తు పెరగడం తో నూతన బ్రిడ్జి కి అనుకుని ఉండడంతో ఈ సమస్య పై సదరు కాంట్రాక్టర్ ఇప్పటి వరకు విద్యుత్ అధికారుల ను సంప్రదించడం లేదని, విద్యుత్ లైన్ సరి చేస్తామని ,చెప్పినా కాంట్రాక్టర్ పెడచెవిన పెడుతుండడం కాంట్రాక్టు నిర్లక్ష్యానికి నిదర్శనం పడుతుంది.బ్రిడ్జి నిర్మాణం పూర్తి కావాలంటే ఇరువైపులా మట్టి పోయాలి సి సి వేయాలి బ్రిడ్జి కింద ఉన్న



మట్టిని తొలగించాలి ఇలా ఎన్నో పనులు ఇంకా మిగిలి ఉన్నా కాంట్రాక్టర్ నిర్లక్ష్యం తో నిర్మాణం మరింత ఆలస్యం కానుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఇప్పటికైనా అధికారులు ప్రజా ప్రతినిధులు స్పందించి బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# ఎట్టకేలకు పెద్దపల్లి పార్లమెంట్ సెగ్మెంట్ ఎమ్మెల్యేల ఐక్యత రాగం

**(మొదటి పేజి తరువాయి)**

వంశీకృష్ణను ప్రకటించిన నాటి నుండి సెగ్మెంట్ పరిధిలోని ఇద్దరు ఎమ్మెల్యేలు మినహా మంత్రి శ్రీధర్ బాబుతో పాటు మిగతా ఎమ్మెల్యే లందరూ పార్టీ నిర్ణయం పట్ల కొంత విముఖత వ్యక్తం చేశారు. కాకా కుటుంబం నుండి ఇప్పటికే బెల్లంపల్లి ఎమ్మెల్యేగా గడ్డం వినోద్, చెన్నూరు ఎమ్మెల్యేగా గడ్డం వివేక్ ఉండగా మళ్లీ అదే కుటుంబానికి చెందిన వంశీకృష్ణకు పార్టీ టికెట్ ఇవ్వడం పట్ల ఎమ్మెల్యేలతో పాటు పార్టీ శ్రేణులు సైతం తీవ్రంగా వ్యతిరేకించారు. నిన్న మొన్నటి వరకు కాంగ్రెస్ పార్టీ పెద్దపల్లి ఎంపీ అభ్యర్థిని మార్చే అవకాశాలు ఉన్నాయంటూ వస్తున్న ప్రచారాలకు చెక్ పెడుతూ మంత్రి తో పాటు సెగ్మెంట్ పరిధిలోని అందరు ఎమ్మెల్యేలు వంశీకృష్ణ గెలుపుకు కృషి చేయాలంటూ పిలుపునిచ్చారు. కానీ వంశీకృష్ణ పెద్దపల్లి పార్లమెంట్ సెగ్మెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల ప్రజలకు ఏమాత్రం కూడా పరిచయం లేకపోవడంతో ఆయన గెలుపు బాధ్యతను మంత్రి, ఎమ్మెల్యేలు తీసుకున్నట్లు తెలుస్తోంది. చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ సైతం తన తనయుడిని ఏలాగైనా ఎన్నికల్లో నిలబెట్టి గెలిపించుకోవాలనే దృఢమైన సంకల్పం మేరకు టికెట్టు సాధించినప్పటికీ, గెలుపు కోసం దేనికైనా వెనుకాడేది లేదంటూ సమరానికి కాలు దువ్వుతున్నారు. టికెట్టు విషయంలో తన పంతం నెగ్గించుకున్న వివేక్, తనయుడి గెలుపు విషయంలో ఎటువంటి నిర్ణయాలు తీసుకుంటారు అనే దానిపై రాజకీయ వర్గాల్లో జోరుగా చర్చ జరుగుతోంది. ఇదిలా ఉండగా వంశీకృష్ణ అభ్యర్థిత్వాన్ని బలపరిచినందుకుగాను మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు ను త్వరలో 'అమాత్యా' పదవిని సొంతం చేసుకోనున్నారు.

# నేర, చట్ట వ్యతిరేక కార్యకలాపాల నియంత్రణ కోసం "ఆపరేషన్ గరుడ"

**(మొదటి పేజి తరువాయి)**

ప్రయోగాత్మకంగా ఆపరేషన్ గరుడ మొదలు పెట్టమని తెలియజేశారు. సిపి రామగుండంలో చార్జ్ తీసుకున్న తర్వాత మొదటిసారి పెద్దపల్లి పోలీస్ స్టేషన్ సందర్శనకు వచ్చినప్పుడు సిబ్బంది వివిధ డ్యూటీ లో ఉండి కొన్ని సందర్భాలలో ప్రత్యేక నిఘా ఉంచడం ఇబ్బంది ఉంటుంది కనుక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి పోలిసింగ్ కి సహాయం పొందేవిధంగా డ్రోన్ ద్వారా ఏరియల్ సర్వే చేయాలనే ఉద్దేశ్యం తో "ఆపరేషన్ గరుడ" కార్యక్రమం అనుకోవడం జరిగింది. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఒక పట్టణం ను పూర్తి స్థాయిలో పర్యవేక్షణ చేయడం తక్కువ సమయం లో డ్రోన్ ద్వారా సాధ్యం అవుతుంది. ఎవరైనా గొడవలకు పాల్పడిన, చట్ట వ్యతిరేకమైన చర్యలకు పాల్పడిన వీడియోలు, ఫోటోల ఆధారాలతో వారిపై కేసులు నమోదు చేయడం జరుగుతుంది అన్నారు. పెద్దపల్లి పట్టణ కేంద్రంతోపాటు శివారు ప్రాంతాల్లో అసాంఘీక కార్యకలాపాలు జరగకుండా ఉండెదుకు ఆపరేషన్ గరుడ పేరిట డ్రోన్‌లతో పెట్రోలింగ్ నిర్వహించి ప్రత్యేక నిఘా ఉంటుందని భవిష్యత్తు లో కమిషనరేట్ వ్యాప్తంగా అమలు చేస్తామన్నారు.ప్రజల భద్రత, నేరాల నియంత్రణ లో భాగంగా పోలీస్ వారికీ తమ వంతు సహాయం గా లీడ్ బ్యాంకు జిల్లా మేనేజర్ చెగొండ వెంకటేష్ ఆపరేషన్ గరుడ కోసం ఉపయోగించే డ్రోన్ కోసం ఆర్థికంగా సహాయం చేయడానికి ముందుకు రావడం జరిగింది. వారిని సీపీ ప్రత్యేకంగా అభినందించారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ అడ్మిన్ సి. రాజు, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ రాఘవేంద్ర రావు, పెద్దపల్లి ఏసిపి కృష్ణ , సీఐ కృష్ణ,ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ సత్యనారాయణ, ఎస్ఐ లు లక్ష్మణ్‌రావు, మల్లేష్ తోపాటు సిబ్బంది పాల్గొన్నారు.

# జగిత్యాలలో ఈఎస్ఐ ఆస్పత్రిని ఏర్పాటు చేస్తా..

**- గల్ఫ్ సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తా - నిజామాబాద్ కాంగ్రెస్ పార్టీ ఎంపి అభ్యర్థి జీవన్ రెడ్డి**

**సూర్య జగిత్యాల**

తనను ఎంపిగా గెలిపిస్తే జగిత్యాలలో ఈఎస్ఐ ఆసుపత్రి, గల్ఫ్ సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తానని నిజామాబాద్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి జీవన్ రెడ్డి అన్నారు. జగిత్యాల పట్టణంలోని పొన్నాల గార్డెన్ లో బుధవారం బీడి కార్మికులు, టేకేదార్లు, కార్మికుల ఆత్మీయ సమ్మేళనానికి ముఖ్య అతిధిగా హాజరయ్యారు. పలువురు టేకేదార్లు కాంగ్రెస్ పార్టీలో చేరగా కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీడీ కార్మికుల సమస్యలు పరిష్కరించేలా కృషి చేస్తా అన్నారు. యూపీఏ పాలనలో గ్రామీణ కూలీలకు ఉపాధి కల్పించాలని సోనియా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం రూపొందించారన్నారు. బీడీ పరిశ్రమ కార్మికులకు ఉపాధి చూపుతోందని, రోజంతా కార్మికులకు కష్టపడినా గిట్టుబాటు కావడం లేదన్నారు. బీడీ కార్మికుల కష్టాలు తెలిసిన



వ్యక్తిని అందరి ఆశీర్వాదం ఉంటే పార్లమెంట్లో అడుగుపెడుతా అని ఆశాభావం వ్యక్తం చేశారు. పార్లమెంట్ కు ఎన్నికైన తర్వాత బీడీ కార్మికులకు గల్ఫ్ కార్మికుల సమస్యలు, బీడి కార్మికుల సమస్యల పై గళమేత్తుతా అని హామీ ఇచ్చారు. జీవిత కాలం కాంగ్రెస్ పార్టీ లోనేవుంటు, ప్రజలకు సేవ చేస్తా, వెయ్యి బీడి లకు 300 వేతనం పెంచేలా చేసే బాధ్యత నాది అని భరోసా ఇచ్చారు. దేశంలో ఎక్కడ లేని విధంగా తెలంగాణ ప్రభుత్వం బీడీ కార్మికులకు పెన్షన్ ఇచ్చారనీ గుర్తు చేశారు. 2014 కు పూర్వం పీ ఎఫ్ బీడీ కార్మికులకు ఉన్న వారికి మాత్రమే ఇస్తున్నారు. తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత 2014 తర్వాత పీ ఎఫ్ రావడం లేదు. బీడి కార్మికులకు వచ్చే పీ ఎఫ్ పెన్షన్ తో సంబందం లేకుండా రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే పెన్షన్ అందేలా కృషి చేస్తానన్నారు. ఇళ్లు లేని బీడి కార్మికులకు ఇంటి నిర్మాణం కోసం రు.5 లక్షలు కేటాయించే బాధ్యత నాది అని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, బీడీ టేకేదార్ల రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తీగల వెంకట్, జిల్లా అధ్యక్షుడు మల్లా రెడ్డి జువ్వాడి నర్సింగ్ రావు, మాజీ చైర్పర్సన్ గిరి నాగభూషణం, దేశాయ్, ఎం పీ పీ మహేష్, మాజీ జెడ్పీటీసీ మాధవి, సతీష్ రాజ్, కళ్లేపల్లి దుర్గయ్య, ముక్రం, మొయిజొద్దిన్, జలపతి రెడ్డి, బంద శంకర్, కొత్త మోహన్, గుంటి జగదీశ్వర్, పుప్పాల అశోక్, తదితరులు పాల్గొన్నారు.

# సూర్య కథనానికి స్పందన

**(మొదటి పేజి తరువాయి)**

గుక్కెడు నీటి కోసం ఎదురు చూపులు' అనే కథనానికి జిల్లా పంచాయతి అధికారి దేవరాజ్ స్పందించి ఓబులాపుర్ తండాలో పర్యటించి విచారిం చారు. సమస్యను పరిష్కరించ డానికి చర్యలు తీసుకుని మరమ్మత్తులు చేయడానికి ఆదేశించినట్లు తెలిపారు. నిర్లక్ష్యంగా వ్యవహరిం చిన కార్యదర్శి పై ఆగ్రహం వ్యక్తం చేస్తూ సమస్యలపై స్పందించకపోతేవిధుల నుండి తొలగించడం జరుగుతుందని హెచ్చరించారు. విధుల్లో నిర్లక్ష్యం వహించిన కార్యదర్శి కి ఎంపిడివొ రాజేందర్ రెడ్డి మెమో జారీచేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా నేటి దినపత్రిక సూర్య కు తండా వాసులు కృతజ్ఞతలు తెలిపారు.

# పకడ్బందీగా ఈవీఎంల రాండమైజేషన్ ప్రక్రియ

**- జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి**

**సూర్య కరీంనగర్ ప్రతినిధి**

ఈవీఎంల 1st రాండమైజేషన్ ప్రక్రియను పకడ్బందీగా పూర్తి చేశామని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి పేర్కొన్నారు. బుధవారం కరీంనగర్ కలెక్టరేట్



కాన్ఫరెన్స్ హాల్లో వివిధ రాజకీయ పార్టీల నేతల సమక్షంలో ఈవీఎంల, వీవీ ప్యాట్ల 1st రాండమైజేషన్ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా రాండమేషన్ కార్యక్రమంపై అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ ఆయా రాజకీయ పార్టీల నేతలకు అవగాహన కల్పించారు. అనంతరం జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ రాండమైజేషన్ కార్యక్రమం పూర్తయిన తర్వాత ప్రతి ఒక్క ఈవీఎంను క్షుణ్ణంగా తనిఖీ చేస్తామని తెలిపారు. మొదటి రాండమైజేషన్లో ఈవీఎంలు అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా అలాట్ అవుతాయని చెప్పారు. రెండో విడత రాండమైజేషన్ లో పోలింగ్ స్టేషన్ల వారీగా ఈవీఎంలు అలౌట్ అవుతాయని పేర్కొన్నారు. వీటికి సంబంధించిన వివరాలను రాజకీయ పార్టీల నేతలకు అందిస్తామని తెలిపారు. లిస్టులో పేర్కొన్న వాటికి అలాట్ చేసిన వాటికి పోల్చి చూసుకోవచ్చని చెప్పారు. వాటి ప్రకారం ఎలాంటి తేడాలు వచ్చే అవకాశమే ఉండదని స్పష్టం చేశారు. ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటు న్నామని తెలిపారు. ఎన్నికల నిబంధనలను ఆయా రాజకీయ పార్టీలు పాటించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ప్రఫుల్ దేశాయ్, లక్ష్మి కిరణ్, డీఆర్ఓ పవన్ కుమార్, కరీంనగర్, హుజురాబాద్ ఆర్డీవోలు కే మహేశ్వర్, రమేశ్ బాబు, కాంగ్రెస్ ప్రతినిధి మడుపు మోహన్, టిడిపి నాయకుడు కల్యాణ అగయ్య, బిజెపి నాయకులు బండ రమణారెడ్డి, నాంపల్లి శ్రీనివాస్, ఎంఐఎం నాయకుడు సయ్యద్ బర్కత్ అలీ, టిఆర్ఎస్, సిపిఎం నాయకులు ఏ శ్రీనివాస్ రెడ్డి, డీ నరేశ్ పటేల్, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# సాగు, తాగునీరు పై పట్టింపు లేని కాంగ్రెస్ ప్రభుత్వం

**- బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపెల్లి శ్రీనివాస్ గౌడ్**

**సూర్య, చొప్పదండి**

చొప్పదండి నియోజకవర్గంలో రైతులు సాగునీరు కోసం, ప్రజలు త్రాగునీరు కోసం అల్లాడుతుంటే కాంగ్రెస్ నాయకులు ఏమాత్రం ప్రజలను పట్టించుకోవడంలేదని బిజెపి జిల్లా ప్రధానకార్యదర్శి తాళ్లపెల్లి శ్రీనివాస్ గౌడ్ ధ్వజమెత్తారు. చొప్పదండి పట్టణంలో అసెంబ్లీ కన్వీనర్ పెరుక శ్రావణ్ అధ్యక్షతన నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పూర్తిగా వ్యవసాయం పై ఆధారపడ్డ నియోజకవర్గ ప్రజలకు సాగునీరు, తాగునీరు అందించవలసిన కాంగ్రెస్ నాయకులు రైతుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అన్నారు.ఎల్లంపల్లి ప్రాజెక్టు ద్వారా చొప్పదండి నియెజక వర్గంలోని రాగంపేట, రెవెళ్లి మొదలుకొని కోడిమ్యాల మండలాల్లో ఎన్ని చెరువులు, కుంటాలు ఎన్ని నింపారో ఎమ్మెల్యే మెడిపెల్లి సత్యం స్వేతపత్రం విడుదల చేయాలన్నారు. రైతుల వరి ధాన్యానికి 22,00 కేంద్ర మద్దతు ధరకు రాష్ట్ర ప్రభుత్వం గ్యారంటీ ఇచ్చిన 500 కలిపి చెల్లించాలని లేనట్లయితే రైతులతో కలిసి ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. రైతులకు ఇచ్చినటువంటి రైతు రుణమాఫీ, పంట నష్ట పరిహారం అమలు చేయకుండా రతులను మోసం చేసిన కేసీఆర్ ఏ మొఖం పెట్టుకుని జిల్లాలో పర్యటిస్తారని ప్రశ్నించారు.ఈ కార్యక్రమంలో కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు సింగిరెడ్డి కృష్ణా రెడ్డి, బిజెపి జిల్లా కార్యదర్శి చేపూరి సత్యనారాయణ, చొప్పదండి, గంగాధర, కోడిమ్యాల, బోయినపల్లి, మాల్యాల మండలాల అధ్యక్షులు బత్తిని ప్రశాంత్, మావురం సుదర్శన్ రెడ్డి తదితరులు ఉన్నారు.



# నీళ్లు రాక.... రైతులు ఆగం

# మీరు ఇస్తారా...? మేమే గేట్లు ఎత్తేయాలా...!?

## - ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి

**సూర్య, హుజురాబాద్**



ఒకవైపు పంటలకు సరిపోయే నీళ్లు రాక రైతులు ఆగమవుతున్నారని, రైతుల కన్నీళ్లు తుడవడానికి మీరు నీళ్లు ఇస్తారా...? మమ్మల్ని గేట్లు ఎత్తమంటారా....!? అని హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి అన్నారు. బుధవారం హుజురాబాద్ నియోజకవర్గంలోని కమలాపూర్ మండలం మర్రిపల్లి గూడెంలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామంలోని పలువురు రైతుల పంట పొలాలను, తోటలను పరిశీలించారు. సాగు నీటికి కటకట చూసి ఆయన రైతులకు ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంటలకు సరిపోయే నీరు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని, పలు ప్రాంతాల్లో నీరు లేక రైతులు ఆవేదన చెందుతున్నారని అన్నారు. వర్షాభావ పరిస్థితుల్లో మూలంగా నీటి కొరత ఏర్పడితే ప్రభుత్వం ఉపశమనంగా కాల్వల ద్వారా నీటిని విడుదల చేయక అశ్రద్ధ చేస్తుందని అన్నారు. బిఆర్ఎస్ మీద కోపం ఉంటే రాజకీయంగా చూడాలి తప్ప, రైతులకు నీరు ఇవ్వక పంటలు ఎండబెడితే అది ఎంతవరకు సమంజసం అని అన్నారు. తెలంగాణ రైతులకు సాగునీరు అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వెంటనే హుజురాబాద్ నియోజకవర్గంలోని 106 గ్రామాలకు మరో తడి కోసం నీళ్లు అందించాలని, నీళ్లు ఇవ్వకపోతే స్వయంగా తానే గేట్లు ఎత్తుతానని ఆయన అన్నారు. ప్రభుత్వం చెప్పిన విధంగానే రైతులు పంటలు వేసుకున్నప్పటికీ సకాలంలో నీళ్లు అందించగా పోవడంతో రైతన్నలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. కేసిఆర్ హయాంలో గత పది సంవత్సరాలుగా నీళ్ల కోసం రైతులు ఏనాడు రోడ్లు ఎక్కలేదని అన్నారు. కేసీఆర్ పదవి నుంచి పక్కకు తప్పుకోగానే రైతులను ప్రభుత్వం ఇబ్బందులకు గురి చేస్తుందని అన్నారు. రైతు ఏడ్చిన రాజ్యం బాగుపడలేదని, త్వరలో కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఇంతకింత అనుభవిస్తుందని అన్నారు. రైతు బంధు పూర్తిస్థాయిలో పడలేదని, దాంతో పాటు రైతు బీమా, రుణమాఫీ, బోనస్ ఇస్తామని చెప్పి రైతులను నట్టేట ముంచారని అన్నారు. వెంటనే సాగు నీళ్లు ఇవ్వకపోతే రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో ఓట్ల కోసం వస్తే ప్రజలు కాంగ్రెస్ నాయకుల్ని ఉరికిస్తారని అన్నారు. నియోజకవర్గం మొత్తంలో ఒక్క ఎకరం ఎండిన చూస్తూ ఊరుకోనని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్, పిఏసిఎస్ చైర్మన్ సంపత్ రావు, కమలాపూర్ జడ్పిటిసి కళ్యాణి లక్ష్మణరావు, పిఏసిఎస్ డైరెక్టర్ ఇంద్రసేనారెడ్డి, సీనియర్ నాయకులు సత్యనారాయణ రావు, మాజీ జెడ్పిటిసి నవీన్, మాజీ సర్పంచ్ విజయ్ కుమార్, సర్పంచులు రమేష్, రైతులు తదితరులు ఉన్నారు.

## అఖిల్ కుటుంబాన్ని పరామర్శించిన మంత్రి పొన్నం

**సూర్య కరీంనగర్ ప్రతినిధి**



మైనార్టీ సెల్ నగర అధ్యక్షులు అఖిల్ అకాల మరణానికి తీవ్ర కల త చెందిన మంత్రి పొన్నం ప్రభాకర్ స్థానిక ముకరంపురలో వారి నివాసంలో కుటుంబ సభ్యులను వారి తల్లిదండ్రులను ,పిల్లలను కలిసి కన్నీటి పర్యంతమయ్యారు. పార్టీ కోసం కష్టపడిన అఖిల్ కుటుంబాన్ని ఆదుకుంటామని భవిష్యత్తులో కూడా అండగా ఉంటామని ఆశాభావం వ్యక్తం చేశారు..ఇట్టి కార్యక్రమంలో సిటీ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మోహ్సిన్ ,టిపిసిసి కార్యదర్శి వైద్యులు అంజన్ కుమార్, యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ అధ్యక్షుడు అబ్దుల్ రెహమాన్ ,మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షులు తాజ్, మహమ్మద్ అమీర్, ఇమ్రాన్, షహబాస్ తదితరులు పాల్గొన్నారు.

## రాజ్యాంగ రక్షణ యాత్రకు తరలిరండి

**సూర్య, హుజురాబాద్**



జాతీయ మాల మహానాడు ఆధ్వర్యంలో తెలంగాణ వ్యాప్తంగా ఏప్రిల్ 2 నుండి 8 వరకు నిర్వహించే రాజ్యాంగ రక్షణ యాత్ర కరపత్రాన్ని బుధవారం హుజురాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో మాల మహానాడు నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాల మహానాడు జిల్లా అధ్యక్షులు కాడే శంకర్ మాట్లాడుతూ న్యాయం, సమానత్వం, సౌభ్రాతృత్వం మూల స్తంభాలుగా భారత రాజ్యాంగాన్ని బాబాసాహెబ్ అంబేద్కర్ రూపొందిస్తే నేడు కేంద్ర ప్రభుత్వ పాలనలో రాజ్యాంగంలోని మౌళిక సూత్రాల పునాదులు ధ్వంసం అవుతున్నాయని, జీవించే హక్కు, మాట్లాడే హక్కు కోల్పోతున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. ఈనెల 5న కరీంనగర్ లో నిర్వహించే యాత్రలో హుజురాబాద్ ప్రాంతం నుంచి అధిక సంఖ్యలో మాల కుల బాంధవులు పాల్గొని విజయవంతం చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి గూడ కనకయ్య, ప్రచార కార్యదర్శి తాళ్ల వెంకన్న, రాష్ట్ర నాయకులు దామెర సత్యం, మండల నాయకులు తొగరు స్వామి, సొల్లు బాబు, సొల్లు దశరథం, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### నిరుపేద యువతి వివాహానికి

## చొప్పదండి లయన్స్ క్లబ్ చేయూత

**సూర్య, చొప్పదండి**



చొప్పదండి పట్టణానికి చెందిన నిరుపేద యువతి సాంబారి కావ్య వివాహంకు లయన్స్ క్లబ్ ఆఫ్ చొప్పదండి సభ్యులు దాతల సహకారంతో రూ :20, 000 ఆర్థిక సహాయం అందచేశారు. ఈ సందర్భంగా అధ్యక్షులు మహేశుని మల్లేశం మాట్లాడుతూ చొప్పదండి లయన్స్ క్లబ్ నిరుపేదలకు అవసరార్థులకు సేవలు అందించేందుకు ఎల్లప్పుడూ ముందు వరుసలో ఉంటుందన్నారు. దాతల సహకారంతో ఆర్థిక సహాయం అందించడం చాలా అభినందనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ చొప్పదండి అధ్యక్షులు మహేశుని మల్లేశం, కార్యదర్శి దూస రాము, కోశాధికారి రాజేష్ పవార్, డిస్ట్రిక్ట్ కో ఆర్డినేటర్స్ పెద్ది లక్ష్మి కాంతం, కొల్లూరి జితేందర్, సభ్యులు వల్లాల జగన్ పాల్గొన్నారు.

## ఘనంగా దొడ్డి కొమురయ్య జయంతి వేడుకలు

**సూర్య, చొప్పదండి**



విప్లవ వీరుడు తెలంగాణ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమరయ్య 97వ జయంతి వేడుకలు చొప్పదండి పట్టణంలోని కురుమ యువజన సంఘం ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. అధ్యక్షులు జిట్ట కుమార్ దొడ్డి కొమురయ్య చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ యువత దొడ్డి కొమురయ్య అడుగుజాడల్లో నడుస్తూ వారి ఆశయాలు నెరవేర్చాలని కోరారు. అలాగే ఈ వేదిక ద్వారా హైదరాబాదులోని ట్యాంక్ బాండ్ పై దొడ్డి కొమురయ్య విగ్రహం ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమం లో వైస్ ప్రెసిడెంట్ నీట్టు మునేష్ ,గుంటి స్వరూప, రాజన్నల తిరుపతి, నీట్టు శ్రీనివాస్, పెద్ది సంపత్, అనిల్, శ్రీనివాస్, వంశీ, రాకేష్, బీరయ్య, వంశీ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన ప్రణవ్

**సూర్య, వీణవంక**



వీణవంక మండలం చల్లూరు స్వర్ణ లత గార్డెన్ లో మామిడాలపల్లి గ్రామానికి చెందిన కంకణాల రవీందర్ రెడ్డి కుమారుడి వివాహం, నర్సింహులపల్లి గ్రామానికి చెందిన సుకినే రాంచందర్ రావు కుమారుడి వివాహాలు బుధవారం జరుగగా హుజురాబాద్ కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జీ వొడితల ప్రణవ్ లు హాజరై నూతన వధూ వరులను ఆశీర్వదించారు. ఆయన వెంట సీనియర్ నాయకులు శ్యామ్ సుందర్ రెడ్డి, సాహెబ్ హుస్సేన్, మాజీ డైరెక్టర్ నల్ల కొండాల్ రెడ్డి, పంజాల సతీష్, మోహన్ రెడ్డితో పాటు పాల్గొన్నారు.

## గొల్లపల్లిలో వడ్ల కొనుగోలు కేంద్రం ప్రారంభం

**సూర్య తిమ్మాపూర్**



కరీంనగర్ జిల్లా పాలనధికారి పమేలా సత్పతి ఆదేశాలనుసారం బుధవారం తిమ్మాపూర్ మండల కేంద్రంలోని గొల్లపల్లి గ్రామంలో వడ్ల కొనుగోలు కేంద్రం ప్రారంభించారు.రైతులు తాము పండించిన ధాన్యాన్ని దళారులకు అమ్మి నష్టపోవద్దని ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యాన్ని అమ్మి ప్రభుత్వం నిర్దేశించిన మద్దతు ధరన పొందాలన్నారు. ఏ గ్రేడ్ కి రూ.2203 బి గ్రేడ్ కి రూ.2183 మద్దతు ధర నిర్దేశించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో కొనుగోలు కేంద్రం ఇంచార్జి గడ్డం మహేందర్,రైతులు పింగిలి కృష్ణ రెడ్డి,మామిడి విద్యాసాగర్,వేల్పుల మధు, సాయిల్ల మల్లవ్వ ,వెన్నం సుధాకర్ రెడ్డి,మల్లెతుల తిరుపతి,తాలపల్లి సంతోష్, కొమ్మెరా శ్రీనివాస్ రెడ్డి, రేషవేని మల్లయ్య, మల్లెతుల రాజయ్య, పాల్గొన్నారు.

## ఓటర్ల స్వేచ్ఛకై పోలీసు కవాతు

### - నిర్భయంగా ఓటు వేయాలి : డిఎస్పి ఉమామహేశ్వరరావు

**సూర్య ఇబ్రహీంపట్నం**



పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ప్రజలు నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని, శాంతియుత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు పగడ్బందీగా చర్యలు తీసుకుంటున్నామని డిఎస్పి ఉమామహేశ్వర్ రావు అన్నారు. ఈ మేరకు కేంద్ర సరిహద్దు బలగాలతో మండల కేంద్రంలోని పురవీధుల గుండా సోమవారం ఫ్లాగ్ మార్చ్ కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎస్పి మాట్లాడుతూ..ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు గురి కాకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవడానికి అనుకూల వాతావరణం నెలకొల్పుతామని అభద్రతా భావాన్ని వీడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సీఐఎస్ ఫ్ ఇంచార్జ్ ఉడాల్ సింగ్, మెట్పల్లి సిఐ పి. నవీన్, ఎస్ఐ పబ్బ కిరణ్ కుమార్, ఇబ్రహీంపట్నం ఎస్ఐ అనిల్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఇద్దరు పిల్లలతో సహ భార్య అదృశ్యం

### -పోలీసులకు పిర్యాదు చేసిన భర్త

**సూర్య జమ్మికుంట**

తన భార్య ఇద్దరు పిల్లలతో సహా అదృశ్యమైందని జమ్మికుంటకు చెందిన సూర రాజు పోలీసులకు ఫిర్యాదు చేశారు బాధితుని ఫిర్యాదు మేరకు సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం సోమవారం పేటకు చెందిన సుర రాజు కు 13 సంవత్సరాల క్రితం జమ్మికుంటకు చెందిన బోదాసు కవిత తో వివాహమైంది వారికి 9 .11 సంవత్సరాల ఇద్దరు పిల్లలు ఉన్నారు భార్య పిల్లలతో మారుతి నగర్ జమ్మికుంట లో కిరాయి ఉంటున్నాడు కాగా ఈనెల 1న తాను కూలీ పనికి పోయి ఇంటికి వచ్చి చూడగా తన భార్య పిల్లలతో సహా కనబడలేదని తన ఇంటి పక్క ఉన్న గుంజి నాగరాజు పై అనుమానం ఉన్నదని పోలీసులకు ఫిర్యాదు చేశాడు బాధితుని ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# వేసవిలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**- జెడ్పీ చైర్ పర్సన్ దావ వసంతసురేష్**

**సూర్య జగిత్యాల**

ఏప్రిల్ నుండి జూన్ మధ్య జిల్లాలో చాలా వరకు సాధారణం కంటే ఎక్కువ ఉష్ణోగ్రతలు నమోదవుతాయని దాని దృష్ట్యా జిల్లా ప్రజలందరూ తగిన జాగ్రత్తలు పాటిస్తూ అప్రమత్తంగా ఉండాలని జగిత్యాల జెడ్పీ చైర్ పర్సన్ దావ వసంత సురేష్ తెలిపారు. జిల్లాలో ఈ ఏడాది అత్యంత వేడిగా ఉండే వేసవి, వడదెబ్బ నుండి జిల్లా ప్రజలకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై జిల్లా వైద్యాధికారి, జిల్లా విద్యాధికారి, డి పి వో లకు బుధవారం వర్చువల్ ఫోన్ కాన్ఫరెన్స్ లో పలు సూచనలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలిపారు. స్కూల్ విద్యార్థులను కాపాడుకోవాల్సిన బాధ్యత మనది కాబట్టి ప్రతి పాఠశాలలో ప్రార్థన సమయంలో పిల్లలకు వడ దెబ్బ తగల కుండా తీసుకోవా ల్సిన జాగ్రత్తలను వివరిం చవ ల్సిందిగా జిల్లా విద్యాధి కారికి ఆదేశించారు. జిల్లా లోని ఆశావర్కర్లు, ఏఎన్ఎం లందరూ వివిధ వ్యాధులతో బాధపడు తున్న వారికి ఈ వేసవిలో వడదెబ్బ వల్ల ఎక్కువగా ఇబ్బంది పాలవుతారు కనుక వారిని రక్షించే విధంగా రక్షణ చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రతి గ్రామంలో ఎండ తీవ్రతకు ఓ ఆర్ ఎస్ విశిష్ఠత, వైద్య పరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రతి ఒక్కరికీ వివరి స్తూ అవగాహన కార్యక్రమాలు



నిర్వహించవలసిందిగా జిల్లా వైద్యాదికారికి ఆదేశించారు. ఉపాధిహామీ పనుల దగ్గర అదేవిధంగా కొనుగోలు కేంద్రాల దగ్గర వారికి అందుబాటులో నీళ్ళు, ఓ ఆర్ ఎస్ పాకెట్స్ అందుబాటులో ఉంచాలని జిల్లా పంచాయితీ అధికారికి ఆదేశించారు. రోడ్ల మీద దొరికే చిరుతిండ్లు, రంగు పానీయాలు తీసుకో కుండా ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి అని అన్నారు. ఉప్పు కలిపిన మజ్జిగ, గ్లూకోజ్ కలిపిన నీరు, ఓరల్ రీ హైడ్రేషన్ పండ్ల రసాలు, కొబ్బరినీళ్లు అదేవిధంగా ముఖ్యంగా పౌష్టికాహారం తీసుకోవాలి సూచించారు.

## సైబర్ నేరాలపై అవగాహన కోసం జాగృక్త దివస్

**సూర్య జగిత్యాల**



ప్రజలలో సైబర్ నేరాలపై అవగాహన కల్పించడానికి జాగృక్త దివస్ ప్రతి నెల మొదటి బుధవారం నిర్వహిస్తున్నామని జగిత్యాల డిఎస్పీ రఘు చందర్ అన్నారు. ఇందులో బాగంగా బుధవారం జగిత్యాల పట్టణంలోని శ్రీ చైతన్య జూనియర్ కాలేజీ లో, హొటల్ బుకింగ్ స్కాం, పెట్టుబడి మోసం, సైబర్ క్రైమ్ నేరాల గురించి కాలేజి విద్యార్థిని, విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఇన్స్పెక్టర్ వేణుగోపాల్, కళాశాల యాజమాన్యం, విద్యార్థులు పాల్గొన్నారు.

## కోరుట్ల ఎమ్మెల్యే ను సన్మానించిన మాజీ మార్కెట్ కమిటీ అధ్యక్షుడు

**సూర్య - కథలాపూర్**



మండల కేంద్రానికి మొదటి సారిగా వచ్చిన కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ ని మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షుడు వర్ధినేని నాగేశ్వర్ రావు శాలువా తో ఘనంగా సన్మానించారు. మండల కేంద్రంలో జరిగిన ఓ శుభకార్యం వచ్చిన ఎమ్మెల్యే ను భారస నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా భారస నాయకులు మార్కెట్ కమిటీ మాజీ ఉపాధ్యక్షుడు సోమ దేవేందర్ రెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షుడు గడ్డం జీవన్ రెడ్డి, తక్కళ్లపల్లి మాజీ ఎంపీటిసి ఏనుగు ఆదిరెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ సభ్యురాలు సబ్బని గంగు, నల్ల గంగాధర్ తదితరులు ఉన్నారు.

## టీబీసీ జేఏసీ ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ వర్ధంతి వేడుకలు

**సూర్య జగిత్యాల టౌన్**



టీ బీసీ జేఏసీ జగిత్యాల జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ వర్ధంతి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని హనుమాన్ వాడలో ఉన్న శివాజీ విగ్రహానికి టీ బీసీ జేఏసి రాష్ట్ర అధ్యక్షుడు హరి అశోక్ కుమార్ ,ప్రతినిధులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా హరి అశోక్ కుమార్ మాట్లాడుతూ శివాజీ మహరాజ్ దేశ ప్రజలకు స్ఫూర్తి నిచ్చారని,ఆ మహనీయుడి ఆశయాల సాధనకు యువత కృషి చేయాలని అన్నారు.ఈ కార్యక్రమంలో బీసీ జిల్లా మహిళా అధ్యక్షురాలు గంగం జలజ,విజయ,విద్యార్ది జిల్లా అధ్యక్షుడు సాయి,జర్నలిస్ట్ మాకు రాజలింగం,తదితరులు పాల్గొన్నారు

## వేసవి సెలవుల్లో పిల్లలు జాగ్రత్త

**- మున్సిపల్ చైర్పర్సన్ అడువాల జ్యోతి**

**సూర్య జగిత్యాల టౌన్**



పిల్లలకు వేసవి సెలవులు రావడంతో జాగ్రత్తగా చూసుకోవాలని జగిత్యాల మున్సిపల్ చైర్ పర్సన్ అడువాల జ్యోతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంకు చెందిన ఏడుగురు పిల్లలు గత మంగళవారం మోతె చెరువులో ఈతకెళ్ళి ఒక బాలుడు మృతి చెందాడ న్నారు. అలాగే బైపాస్ రోడ్లో బైక్ పై వెళుతూ ఎదురుగా వస్తున్న వాహనదారుడు ఢీ కొట్టడంతో మరో బాలుడు మృత్యు వాత పడ్డాడని ఆవేదన వ్యక్తం చేశారు. కావున తల్లిదండ్రులు మీ పిల్లలను ఈ సెలవుల్లో జాగ్రత్తగా చూసుకోవాలని కోరారు. కంప్యూటర్ క్లాసెస్ గాని కోచింగ్ ఇన్స్టిట్యూట్ లో గాని విద్యపై దృష్టి సాధించేలా చూడాలని కోరారు.

## ప్రజల్లో కాంగ్రెస్ ప్రభుత్వం పై విశ్వా సం పెరిగింది

**- డిసిసి మాజీ సభ్యుడు సత్యనారాయణ**

**సూర్య - కథలాపూర్**



తెలంగాణ రాష్ట్ర ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం పై విశ్వాసం పెరిగిందని డిసిసి మాజీ సభ్యుడు చెదలు సత్యనారాయణ అన్నారు. బుధవారం ఆయన మండల కేంద్రంలోని ప్రెస్ క్లబ్ లో విలేకరులతో మాట్లాడారు. వంద రోజుల్లోనే ఇచ్చిన ఆరు గ్యారంటీలను దాదాపుగా పూర్తి కావస్తోందని, దాంతో ప్రజల్లో కాంగ్రెస్ పై విశ్వాసం పెరిగిందని అన్నారు. రాబోవు పార్లమెంట్ ఎన్నికల్లో రాష్ట్రంలో అత్యధిక సీట్లను కైవసం చేసుకుంటుందని అన్నారు. కరీంనగర్ పార్లమెంట్ అభ్యర్థిని భారీ మెజారిటీతో గెలిపించుకునేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని కోరారు. రాష్ట్రంలో బి ఆర్ ఎస్ ను, దేశంలో బిజెపిని ప్రజలు తిరస్కరించనున్నరని పేర్కొన్నారు. అధికారంలో ఉన్నప్పుడు పంటలు తీవ్రంగా నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించనీ మీరు నష్టపరిహారం చెల్లించమని డిమాండ్ చేయడం సిగ్గుచేటని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతుల క్షేమం కోస%శీ% కృషి చేస్తుండడం బిజెపి, భారస జీర్ణించుకోవడం లేదని అన్నారు.

## గెలుపే లక్ష్యంగా వ్యూహ ప్రతి వ్యూహాలపై చర్చించిన కేంద్రమంత్రి

**సూర్య -కోరుట్ల టౌన్**



కేంద్ర మంత్రి, బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు జి కిషన్ రెడ్డి భాగ్యనగరంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సురభి నవీన్ స్వగృహంలో బుధవారం కలిశారు. ఈ సందర్భంగా రాబోయే లోకసభ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా వ్యూహ, ప్రతివ్యూహాలపై చర్చించిన అనంతరం రాష్ట్ర అధ్యక్షులు జి కిషన్ రెడ్డికార్యకర్తలకు దిశ, నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సురభి నవీన్ కుమార్ మాట్లాడుతూ మోదీ నాయకత్వం లొ కిషన్ రెడ్డి గెలుపు కు సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో బీజేపీ సైనికులు అందరు కంకణ బద్దులై నరేంద్ర మోదీ పది సంవత్సరాల కాలంలో జరిగిన అభివృద్ధి, దేశ ప్రజల సంక్షేమం కోసం తీసుకొచ్చిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని కోరారు.తన నివాసానికి విచ్చేసిన రాష్ట్ర అధ్యక్షులను సురభి నవీన్ కుమారుశాలువాతో సత్కరించారు.

## ఎస్సారెస్పీ కెనాల్ లో గుర్తుతెలియని శవం లభ్యం

**సూర్య కోరుట్ల రూరల్**



కోరుట్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని పెద్దాపూర్ గ్రామ శివారులోగల ఎస్సారెస్పీ-36 కెనాల్ లో గుర్తుతెలియని మగ వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై కిరణ్ కుమార్ తెలిపారు. కాగా పెద్దాపూర్ గ్రామస్తులు అటు వైపు వెళ్తుండగా మృతదేహాన్ని గమనించి వెంటనే కోరుట్ల పోలీసులకు సమాచారం ఇచ్చినట్లు ఎస్సై కిరణ్ పేర్కొన్నారు. సమాచారం అందిన వెంటనే పోలీసులు మృతదేహం దగ్గరికి వెళ్లి మృతదేహాన్ని వెలికి తీసినట్లు తెలిపారు . మృతుడు దాదాపు 40 సంవత్సరాల లోపు ఉండవచ్చని, నల్లని టీ రంగు షర్టు, నల్లని లోయర్ దుస్తులు ధరించి ఉన్నాడని ఎస్సై కిరణ్ కుమార్ పేర్కొన్నారు. మృతుడి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## భక్తుల ఇంటి వద్దకే భద్రాచలం రాముల వారి కళ్యాణ తలంబ్రాలు

**సూర్య -కోరుట్ల**



శ్రీరామనవమి సందర్భంగా భద్రాచలంలో జరిగే శ్రీ సీతారామ చంద్రుల కల్యాణోత్సవ తలంబ్రాలను దేవాదాయ శాఖ వారి సహకారంతో భక్తుల ఇంటి వద్దకే చేర్చే పవిత్రమైన కార్యక్రమానికి టిఎస్ఆర్టిసి యాజమాన్యం శ్రీకారం చుట్టిం ది,ఎంతో పవిత్రమైన ఈ కళ్యాణ తలంబ్రాలను కోరుకునే భక్తులు కోరుట్ల డిపో టిఎస్ఆర్టిసి లాజిస్టిక్స్ కేంద్రంలో 151 రూపాయలు చెల్లించి బుకింగ్ చేసుకోవాలని కరీంనగర్ రీజియన్ కార్గో ఏటీఎం సదాశివ్ తెలిపారు. మరిన్ని వివరాలకు కోరుట్ల డిపో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ రమేష్-9154298572 కోరుట్ల కార్గో ఆఫీస్ సెల్ నెంబర్లను 9959105928 సంప్రదించి కళ్యాణ తలంబ్రాలను బుకింగ్ చేసుకోవాలని కోరారు.

## మున్సిపల్ ఆధ్వర్యంలో చలివేంద్రాల ఏర్పాటు

**సూర్య -కోరుట్ల**



జిల్లా కలెక్టర్ యాస్మిన్ భాషఆదేశాల మేరకు ఎండల తీవ్రతను దృష్టిలో పెట్టుకొని బుధవారం కోరుట్ల పట్టణం లోని కొత్త మున్సిపల్ ఆఫీస్, ఓల్డ్ మున్సిపల్ ఆఫీస్,కొత్త బస్టాండు, నంది చౌక్ నందు నాలుగు చలివేంద్ర కేంద్రాలను మున్సిపల్ కమిషనర్ బట్టు తిరుపతి ,మున్సిపల్ ఆధ్వర్యంలో ప్రారంభిం చారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఎండల తీవ్రతను దృష్టిలో పెట్టుకొని వీటిని ఏర్పాటు చేయడం జరిగింది కావున పట్టణ ప్రజలు, పరిసర ప్రాంత ప్రజలు వీటిని వినియోగించుకోవాలని కోరారు. అల్లమయ్య గుట్ట ప్రాంతం లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లు నిలువలను పరిశీలించి వాటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఆర్టీసీ డిపో మేనేజర్ విజయ మాధురి ,మున్సిపల్ మేనేజర్ రాకేష్ ,సానిటరీ ఇన్స్పెక్టర్ గజానంద్, హెల్త్ అసిస్టెంట్ ప్రవీణ్ కుమార్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## జమాతే ఇస్లామీ హింద్ ఆధ్వర్యంలో పేట భాస్కర్ కు ఘన సన్మానం

**సూర్య -కోరుట్ల**



ఆసియా ఇంటర్నేషనల్ కల్చరల్ రిసెర్చ్ యూనివర్సిటీ నుం డి ఇటీవలడాక్టరేట్ అవార్డ్ పొందిన సామాజిక ఉద్యమనేత తెలంగాణ ప్రజాసంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు పేట భాస్కర్ ను జమాతే ఇస్లామీ హింద్ కోరుట్ల కమిటీ నాయకులు బుధవారం అభినందిస్తూ ఘనంగా సన్మానించారు. జమాతే ఇస్లామీ హింద్ కోరుట్ల అధ్యక్షులు ఎం డి ఇలీయాస్ ఖాన్,ఉపాధ్యక్షులు రిటైర్డ్ ప్రోపెసర్ నయిమోద్దిన్ ఆద్వర్యంలో నాయకులతో కలిసి పేట భాస్కర్ ను ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పేట భాస్కర్ విద్యార్థి దశ నుండే బడుగు బలహీన నిరుపేదల పక్షాన నిలబడడం అది ఇప్పటివరకు కొనసాగించడం భాస్కర్ చిత్తశుద్ధికి నిదర్శనమని కొనియాడుతూ డాక్టరేట్ అవార్డ్ రావడం హర్షణీయమన్నారు. ఈ కార్యక్రమంలో అద్యాత్మిక వక్త మహ్మద్ షేక్, నాయకులు చెన్న విశ్వనాథం, సుతారి రాములు,లతీఫ్,మసూద్ అలీ,అజ్మదుల్లాఖాన్,రాంబాబు, రాజేష్ ,వంశీ తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాలల అభివృద్ధిలో భాగస్వాములు కండి

## -జూన్ పదిలోగా పనులు పూర్తి చేయండి

## -జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి

## -అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఏర్పాటు, పనుల నిర్వహణపై సమీక్ష

**సూర్య కరీంనగర్ ప్రతినిధి**



మహిళలైతే చక్కగా పని చేయిస్తారు.. డబ్బు వృధా చేయకుండా పొదుపుపై దృష్టి పెడతారు.. అందుకే మహిళా సంఘాలకు ప్రభుత్వం పెద్ద బాధ్యత అప్పగించింది. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిలో భాగస్వాములను చేస్తున్నది. అందుకే జిల్లా, మండల సమైక్య సంఘాల ప్రతినిధులు పాఠశాలలను అత్యుత్తమంగా తీర్చిదిద్దాలి.. అని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి పిలుపునిచ్చారు. బుధవారం కరీంనగర్ కలెక్టరేట్ ఆడిటోరియం లో ఎంఈఓలు, ప్రభుత్వ పాఠశాలల హెచ్ఎంలు, వివిధ శాఖల ఇంజినీరింగ్ అధికారులు, జిల్లా, మండల సమైక్య సంఘాల ప్రతినిధులతో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఏర్పాటు, పాఠశాలలో చేపట్టాల్సిన పనులపై జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మీ పిల్లల భవిష్యత్తు కోసం ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సమైక్య సంఘాల ప్రతినిధులకు సూచించారు. మనస్ఫూర్తిగా పనిచేస్తూ పాఠశాలల రూపు రేఖలు మార్చాలని పేర్కొన్నారు. పాఠశాలల్లో టాయిలెట్స్, కిచెన్ షెడ్స్, కాంపౌండ్ వాల్స్, అదనపు తరగతి గదుల నిర్మాణం, తాగునీరు, విద్యుత్ సరఫరాతోపాటు ఇతర మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇవ్వాలని పేర్కొన్నారు. పనులు చేపట్టడంలో వీవో అధ్యక్షురాలు కీలకంగా వ్యవహరిస్తారని తెలిపారు. ప్రభుత్వానికి చెడ్డ పేరు వచ్చే పనులు చేయవద్దని విజ్ఞప్తి చేశారు. పాఠశాలల్లో చక్కగా పనులు చేసి సంఘాల ప్రతినిధులు ఇతరులకు రోల్ మోడల్ గా నిలవాలని సూచించారు. పనులు చేయించినందుకు మూడు శాతం అడ్మినిస్ట్రేషన్ ఫీజును ప్రభుత్వం అందిస్తుందని, దీంతో అదనపు ఆదాయం సంపాదించుకునే అవకాశం ఉందని పేర్కొన్నారు. వారం రోజుల్లోగా మండల స్థాయిలో పనుల నిర్వహణపై వర్క్ షాప్ లు పూర్తి చేయాలని విద్యాశాఖ అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. మహిళా సంఘాలకు ఇదొక మంచి అవకాశమని, దీన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పాఠశాలల్లో అన్ని పనులన్నీ జూన్ 10లోగా పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రపుల్ దేశాయ్, డీఈఓ జనార్దన్ రావు, జడ్పి సీఈవో శ్రీనివాస్, డిపిఓ రవీందర్, డి ఆర్ డి ఓ శ్రీధర్, మెప్మా పిడి రవీందర్, మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ స్వరూపా రాణి, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## బార్ అసోసియేషన్ విజేతలకు ఘన సన్మానం

**సూర్య, హుజురాబాద్**



హుజురాబాద్ బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులుగా బండి రమేష్, లైబ్రరీ సెక్రెటరీగా అప్పని రాజు లు ఎన్నిక కావడం పట్ల బుధవారం హుజురాబాద్ పెరిక సంఘం నాయకులు హుజురాబాద్ పట్టణంలోని సాయి రూప గార్డెన్స్ లో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పెరిక సంఘం నాయకులు మీస రమేష్, డాక్టర్ పోతరాజు శ్రీనివాస్, అంకతి శ్రీనివాస్, భారత ప్రభాకర్, ఆకుల వెంకటరాజం, భారత రజనీకాంత్, సందెల వెంకన్న, ముక్కెర కనకయ్య, పోతరాజు వీరయ్య, ఉగ్గె పరమేశ్వర్, మీస తిరుమలేష్, పోతరాజు కుమారస్వామి, భారత మహేందర్, కోన జయంత్, అచ్చె బాలక్రిష్ణ, పత్తిపాక విజయభాస్కర్, పోతరాజు ప్రవీణ్, బండి రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

## ఎండ దెబ్బ తగలకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

### -జిల్లా విద్యాధికారి మాధవి

**సూర్య-పెద్దపల్లి రూరల్**



ఉష్ణోగ్రతలు అధికంగా నమోదు అవుతున్నందున, తీవ్రతను దృష్టిలో ఉంచుకొని ఎండ దెబ్బ తగలకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా విద్యాధికారి మాధవి అన్నారు. పెద్దపల్లి మండల పరిషత్ సమావేశ మందిరంలో వేసవి ఉష్ణోగ్రతల దృష్ట్యా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డి ఈ ఓ మాట్లాడుతూ ఎండలో బయట తిరగవద్దని, అత్యవసర పరిస్థితి అయితే తప్ప ప్రజలు బయటికి రాకూడదని, మధ్యాహ్నం 12 గంటల నుండి 4 గంటల మధ్యలో ఎట్టి పరిస్థితులలో ఇండ్ల నుంచి బయటకు రావొద్దని అన్నారు. చిన్నారులు, వయోవృద్ధులు ఇంటికే పరిమితం కావాలని, ప్రతి రోజు సరిపడ నీరు తీసుకోవాలని, వదులుగా ఉన్న దుస్తువులను ధరించాలని, బయటికి వెళ్ళేటప్పుడు గొడుగు లేదా టోపిని దరించాలని అన్నారు. ద్విచక్రవాహనాల పై సుదూర ప్రయాణాలు చేయకూడదని, సూర్యుని కిరణాలు శరీరంపై పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. అలాగే ఎండలో పనిచేసే కార్మికులు తరచుగా నీటీతో పాటు ఓ.ఆర్.ఎస్. ద్రావణాన్ని తీసుకోవాలని తద్వారా వడదెబ్బ నుండి శరీరాన్ని కాపాడుకోవచ్చన్నారు. జన సంచారం అధికంగా ఉండే ప్రాంతాలలో చలి వేంద్రాలను ఏర్పాటు చేసి, మంచినీరు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చూసుకోవాలని అన్నారు. చర్మం పై ఎర్రటి దద్దుర్లు, చర్మం పొడిబారడం లాంటివి చర్మం పై వస్తున్న మార్పులను గమనించాలని, అధిక శరీర ఉష్ణోగ్రత, అలసట, నోరు ఎండి పోవడం, తలనొప్పి, ఒళ్లు నొప్పులు, వాంతులు, జ్వరం వంటి లక్షణాలు కనిపిస్తే సమీప ఆసుపత్రులలో సంప్రదించి లేదా 108 కు ఫోన్ చేసి అవసరమైన చికిత్స, మందులు పొందాలని అన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ శ్రీనివాస్, మండల విద్యాధికారి సురేందర్ కుమార్, ఎంపీవో సుదర్శన్, ఏ పీవో రమేష్ బాబు, ఏ పీఎం లు దివ్య, సంపత్ కుమార్ లు అధికారులు మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## పిఏసిఎస్ రైతు ఖాతాల్లో వడ్డీ రాయితీ, డివిడెండ్ జమ

### -చైర్మన్ వెల్మ మల్లారెడ్డి

**సూర్య, చొప్పదండి2**



చొప్పదండి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో 2021-22 సం.లో పంట రుణం పొందిన 1099 మంది సంఘ సభ్యులకు కేంద్ర ప్రభుత్వం ద్వారా వచ్చిన 3% శాతం (ఇంటరెస్ట్ సబ్వేన్షన్ )వడ్డీ రాయితీ మొత్తం 12,64,080/- రూ.లను రైతుల ఖాతాల్లో జమ చేయడం జరిగిందని చైర్మన్ వెల్మ మల్లారెడ్డి తెలిపారు. అలాగే సంఘ సభ్యులైన 3081 మంది రైతుల యొక్క వాటాదనం పై 10% డివిడెండ్ మొత్తం 22,33,826/- రూపాయలను వారి ఖాతాల్లో జమ చేశామన్నారు. రైతులను ఉద్దేశించి సంఘములో రుణం పొందిన ప్రతి రైతు సకాలంలో రుణాలు చెల్లించి సంఘ అభివృద్ధికి ఎంతగానో తోడ్పడుతున్నారని, పాలకవర్గ సభ్యులు సంఘానికి రైతులకు మధ్య సమన్వయంతో ప్రతి రైతుకు వారికి కావాల్సిన ఎరువులు,పురుగుమందులువ్యవసాయ పెట్టుబడులకు కావలసిన ఆర్థిక అవసరాలను సంఘం ద్వారా అందించి వారి అభ్యున్నతికి కృషి చేస్తున్నారని తెలిపారు.సంఘ అభివృద్ధికి గోదాములు నిర్మించుకోవడానికి కావలసిన నిధులను కేడీసీసీ బ్యాంక్ సమకూర్చుతున్నారని టీస్కేబ్ , నఫ్స్కేబ్ చైర్మన్ కొండూరు రవీందర్ రావు , సీఈవో ఎన్.సత్యనారాయణ రావు లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

### ప్యాక్స్ కొనుగోలు కేంద్రం ప్రారంభించిన డి ఎం ఓ

-పి ఏ సి ఎస్ ఆధ్వర్యంలో చొప్పదండి లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని డి ఎం ఓ పద్మావతి, జిల్లా సహకార అధికారి రామానుజాచార్యులు ప్రారంభించారుఈ కార్యక్రమంలో కార్యదర్శి కళ్లెం తిరుపతి రెడ్డి, సిబ్బంది మహిపాల్ రెడ్డి, రాజమౌళి , తిరుపతి, శంబయ్య శ్రిపాల్ రెడ్డి, రాజేశం లు, మార్కెట్ కార్యదర్శి మల్లేశం, మల్లికార్జున, తోడుపునూరి లచ్చయ్య పాల్గొన్నారు.

## రైలు కిందపడి యువకుడు మృతి

**సూర్య జమ్మికుంట**

జమ్మికుంట రైల్వే స్టేషన్ సమీపంలో బుధవారం ఉదయం 7.35 గంటలకు గుర్తు తెలియని యువకుడు తమిళనాడు ఎక్స్ప్రెస్ కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు వయస్సు సుమారు 25-30 సంవత్సరాలు ఉంటుంది మృతుని వద్ద ఎలాంటి గుర్తింపు కార్డులు లేవు. బ్లూ ఫుల్ షర్ట్ పై తెలుపు చుక్కల డిజైన్ నలుపు రంగు ప్యాంటు ధరించి ఉన్నాడు మృతదేహాన్ని జమ్మికుంట గవర్నమెంట్ హాస్పిటల్ మార్చురీ లో భద్రపరిచారు వివరాలు తెలిసినవారు తనను సంప్రదించాలని రైల్వే పోలీస్ హెడ్ కానిస్టేబుల్ తిరుపతి కోరారు

## రేణుక ఎల్లమ్మ తల్లి ఆశీస్సులతో గ్రామస్తులు సుభిక్షంగా ఉండాలి

### -పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు

**సూర్య కాల్వ శ్రీరాంపూర్**



రేణుక ఎల్లమ్మ తల్లి ఆశీస్సులతో మంగపేట గ్రామస్తులు సుభిక్షంగా ఉండాలని పెద్దపల్లి ఎమ్మెల్యే చింత కుంట విజయ రమణారావు అన్నారు.మంగళవారం కాల్వ శ్రీరాంపూర్ మండలం మంగపేట గ్రామంలో గౌడ కులస్తుల ఆధ్వర్యంలో రేణుక ఎల్లమ్మ తల్లి బోనాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు నెత్తిన బోనాలను బూని శివసత్తుల పూనకాలతో డప్పు చప్పులతో రేణుక ఎల్లమ్మ తల్లి ఆలయ వద్దకు చేరి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా వారి కుటుంబ సభ్యులు పిల్లాపాపలు చల్లంగా ఉండాలని పాడిపంటలు సమృద్ధిగా పండాలని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే విజయ రమణారావు మాట్లాడుతూ గ్రామ గౌడ కులస్తులంతా ఒకే చోటికి చేరి కలిసికట్టుగా బోనాల పండుగను నిర్వహించుకోవడం అభినందనీయం అన్నారు. గ్రామాల్లో దైవ కార్యక్రమాల ద్వారా భక్తి భావము పెరుగుతుందని దీంతో క్రమశిక్షణ అలవాటు పడుతుందని అన్నారు. గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యే విజయరామరావుతోపాటు పలువురి నాయకులను గౌడ కులస్తులు శాలువలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వేర్వేరుగా ఎంపీపీ నూనేటి సంపత్, జెడ్పిటిసి వంగల తిరుపతిరెడ్డి, మాజీ ఎంపీపీ గోపగోని సారయ్య గౌడ్, మాజీ జెడ్పిటిసి లంక సదయ్య, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు ఎండి మునీర్, కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు గాజనవేన సదయ్య, నాయకులు డొంకెన మొగిలి, ఎండి సజ్జు, ఎండి కలీమొద్దీన్, మాదాసి సతీష్, బుర్ర కొమురయ్య గౌడ్, సదయ్య,గౌడ సంఘం నాయకులు, ఆయా పార్టీల నాయకులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రం ప్రారంభం

**సూర్య-పెద్దపల్లి రూరల్**



ప్రాథమిక సహకార సంఘం పెద్దపల్లి ఆధ్వర్యంలో మండలం లోని కొత్తపల్లి గ్రామం లో పెరుక కనుకయ్య తో పాటు కార్యనిర్వాహక అధికారి మదన్ మోహన్ వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రైతులు శ్రీనివాస్, రాజేందర్, రాయమల్లు, కుమార్, శేఖర్ మైసయ్య తదితరులు పాల్గొన్నారు.

## దేవాలయానికి జెఎస్ఆర్ విరాళం

**సూర్య కాల్వ శ్రీరాంపూర్**



కాల్వ శ్రీరాంపూర్ మండలంలోని మోట్లపల్లి గ్రామంలో నిర్మించిన శ్రీ లక్ష్మీ గణపతి రామ చంద్ర లక్ష్మణ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి శివాలయం నాగ దేవత ఆలయాలకు కాంట్రాక్టర్ జిన్న శ్రీనివాసరెడ్డి లక్ష రూపాయలు విరాళం గా అందించారు. గ్రామస్తులు ఈ సందర్భంగా జిన్న శ్రీనివాసరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ తుల మనోహర్ రావు, ఆలయ కమిటీ సభ్యులు జంగా ప్రభాకర్ రెడ్డి ,గాదర్ల వెంకటేష్ గౌడ్, దోమ్మటి పోచాలు, గాజర్ల శ్రీనివాస్ గౌడ్ తదితరులు ఉన్నారు.

# రౌడీలుగా కాదు - హీరోలుగా మారండి

## - జిల్లాలోని రౌడీ షీటర్స్ కు జిల్లా ఎస్పీ కౌన్సిలింగ్

**సూర్య రాజన్న సిరిసిల్ల.**



నేర ప్రవృత్తితో సమాజంలో రౌడీలుగా చలామణి అవుతున్నవారు మంచి పనులు చేస్తూ హీరోలుగా మారాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ పిలుపునిచ్చారు. పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో రాజన్న సిరిసిల్ల జిల్లాలో ని రౌడీషీటర్స్ కు బుధవారం సిరిసిల్ల పట్టణ పోలీస్ స్టేషన్లో జిల్లా ఎస్పీ కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ నేర జీవితం వీడి సన్మార్గంలో నడుస్తూ హుందాగా జీవించాలని హితువు పలికారు. తొందర పాటులో చేసిన నేరాల వల్ల తమతోపాటు తమ కుటుంబాలు కూడా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని వెల్లడించారు. ఏ తప్పు చేయని కుటుంబ సభ్యులు రౌడీషీటర్స్ అన్న పేరుతో సమాజంలో వివక్షకు గురవుతారన్న విషయాన్ని గమనించాలన్నారు. తమ కుటుంబం, పిల్లల భవిష్యత్ ను దృష్టిలో పెట్టుకొని రౌడీ షీటర్స్ గా నమోదు అయిన వారు ప్రవర్తనలో మార్పు తెచ్చుకోవాలని సూచించారు. రౌడీ షీటర్ అనే ఓ పదం తమ బిడ్డల భవిష్యత్ కూడా నాశనం చేస్తుందని గుర్తు చేశారు.సమాజంలో ఒక రౌడిగా కాకుండా మీ పిల్లలకు ఓ మంచి తల్లిదండ్రులుగా ఉంటూ హీరోగా మిగిలిపోవలని ఎస్పీ కోరారు. జిల్లాలో ఉన్న రౌడి షీటర్స్ కి మార్పు చెందేందుకు ఒక అవకాశం కల్పిస్తున్నామని ఈ సందర్భంగా ఎస్పీ వెల్లడించారు. పార్లమెంట్ ఎన్నికల అనంతరం డిసెంబర్ లోగా తమ ప్రవర్తనలో మార్పు వస్తే మీ మీద ఉన్న రౌడి షీట్స్ తొలగించే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. జిల్లాలోని ప్రతి ఒక రౌడీ షీటర్ కదలికలు,చర్యల పై పోలీస్ నిఘా ఉంటుందని, నేర ప్రవృతి లో మార్పు రాకపోతే చట్టపరంగా చర్యల తీసుకోవడం జరుగుతుందని హెచ్చరిం చారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలోనే కాకుండా భవిష్యత్తులో ఎలాంటి నేరాలకు పాల్పడకుండా మంచి సత్ప్రవర్తంతో ఉండాలని, ఏలాంటి ప్రలోభాలకు గురై నేరాలకు పాల్పడకుండా ఉండాలన్నారు. నేరప్రవృత్తిని మార్చుకోవడానికి ఇస్తున్న సదవకాశాన్ని జిల్లాలోని రౌడీషీటర్స్ వినియోగించుకొని సత్ప్రవర్తన కలిగి ఉండడం ద్వారా తమ మీద ఉన్న రౌడీ షీటును తొలగించుకోవాలని ఎస్పీ కోరారు. ఒకవేళ నేల ప్రవృత్తిని మార్చుకోకపోతే కఠినంగా వ్యవహరించాల్సి వస్తుందని హెచ్చరించారు.గత పది సంవత్సరాల నుండి ఎలాంటి నేరాలకు పాల్పడకుండా మంచి సత్ప్రవర్తన కలిగి ఉండి పూర్తిగా మారితే రౌడీ షీట్ తొలగించేందుకు కూడా అవకాశం ఉందని ఎస్పీ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ చంద్రయ్య, డిఎస్పీ లు చంద్రశేఖర్ రెడ్డి, నాగేంద్రాచరి, సి.ఐ లు ,ఎస్.ఐ లు సిబ్బంది పాల్గొన్నారు.



## దొడ్డి కొమురయ్య విగ్రహానికి నివాళులు అర్పించిన నాయకులు

**సూర్య బోయినపల్లి**



సాయుధ రైతాంగ పోరాటంలో దొరల గడీలను గడగడలాడించిన వీరుడు,భూమి,భుక్తి,వెట్టిచాకిరి నుంచి విముక్తి కోసం నేల కొరిగిన తొలితరం యోధుడు,దొరల పెత్తందారీ వ్యవస్థపై తిరగబడిన విప్లవాగ్ని,శ్రీ దొడ్డి కొమురయ్య జయంతి సందర్భంగా ఆ మహనీయుడి త్యాగాన్ని స్మరిస్తూ బోయినపల్లి మండలం విలాసాగర్ గ్రామంలో దొడ్డి కొమురయ్య విగ్రహానికి నివాళులు అర్పించడం జరిగింది,ఈ కార్యక్రమంలో ఏనుగుల ప్రశాంత్ కుమార్,సాన సత్యం,బొప్పెన శ్రీనివాస్,బొప్పెన అనిల్,గంగాధర సాగర్, ఏనుగుల కొమురయ్య, ర్యాగల్ల అజయ్ తదితరులు పాల్గొన్నారులి

## బీఆర్ఎస్ కు పలువురు రాజీనామా

**సూర్య వేములవాడ టౌన్**



రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రురల్ మండలం చెక్కపల్లి గ్రామంలో బీఆర్ఎస్ కు గట్టి షాక్ తగిలింది. గ్రామానికి చెందిన పలువురు క్రియాశీలక నాయకులు, వార్డు సభ్యులు, కార్యకర్తలు పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. రాజీనామా పత్రాలను జిల్లా అధ్యక్షులు తోట ఆగయ్య కు మీడియా ముకంగా తెలియపరుస్తూ వ్యక్తిగత కారణాలతోనే రాజీనామా చేసినట్లు నాయకులు తెలిపారు. రాజీనామా చేసిన వారిలో చెక్కపల్లి గ్రామ మాజీ సర్పంచ్ అడ్డిక జైపాల్ రెడ్డి మాజీ ఉప సర్పంచ్ తలరి మంజుల సురేష్ మాజీ వర్డ్ సభ్యులు వసాల రాజేందర్ మెతుకు నారాయణ వంగ కావ్య శేఖర్ మరియు పలువురు కార్యకర్తలు ఉన్నారు

## కారు డీ బైకిస్ట్ కి తీవ్ర గాయాలు

**సూర్య. ఇల్లంతకుంట..04..**



మండలం లోని కందికట్కూరు-పాండలపూరం గ్రామాల మార్గ మధ్యలో కారు బైక్ ను డీకొట్టడంతో బైకిస్టు కందికట్కూరు గ్రామానికి చెందిన రాచకొండ అశోక్ కు కాలుకు తీవ్ర గాయాలయ్యాయి. రోడ్డు పై ఎదురు ఎదురుగా డీకొన్నాయి. గాయాల పాలయిన వ్యక్తిని హుటా హుటిన ఆసుపత్రికి తరలించగా చికిత్స అందుతుందని గ్రామస్తులు తెలిపారు.

## రైతులను ఇబ్బందులకు గురి చెయ్యద్దు

**సూర్య సిరిసిల్ల టౌన్ 02**



కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీల అమల్లో భాగంగా రైతు పండించిన వరికి క్వింటాలుకు మద్దతు ధరతో పాటు 500 రూపాయలు బోనస్ చెల్లించాలని భారతీయ జనతా పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డబోయిన గోపి,పార్లమెంట్ కన్వీనర్ ఆడెపు రవీందర్ డిమాండ్ చేశారు.సిరిసిల్ల ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ పది సంవత్సరాల బిఆర్ఎస్ ప్రభుత్వంలో రైతులు అరిగోసపడ్డారని ఒక్కసారి కూడా పంట నష్టపోయిన రైతులను ఆదుకోలేదన్నారు.రైతు ప్రభుత్వం అని చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీల అమలు చేస్తామని అధికారంలోకి వచ్చి ఏ ఒక్క హామీని అమలు చేయడం లేదన్నారు.సిరిసిల్ల నియోజకవర్గంలో 90 ఎకరాలు అకాల వర్షాలకు పంట నష్టం జరిగిందని, వాటన్నింటినీ లెక్కించి ఎకరాకు 20వేల రూపాయల పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 100 రోజులు అవుతున్న 2 లక్షల రుణమాఫీ ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. అధికారం రాకముందు ఒక మాట వచ్చిన తర్వాత మరొక మాట మాట్లాడడం సిగ్గుచేటు అన్నారు. వారికి క్వింటాల్ కు 2200 తో పాటు అదనంగా 500 రూపాయల బోనస్ చెల్లించే వరకు బిజెపి పార్టీ పోరాడుతుందని అన్నారు.రైతుబంధు అమలు చేయాలని పసల్ బీమా యోజన పథకాన్ని రాష్ట్రంలో అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు మున్సిపల్ కౌన్సిలర్ గూడూరి భాస్కర్, పట్టణ అధ్యక్షులు నాగుల శ్రీనివాస్, మండల అధ్యక్షులు పొన్నాల తిరుపతి రెడ్డి,గంట అశోక్,మోర శ్రీహరి,కోడం శ్రీనివాస్, చొప్పదండి శ్రీనివాస్,అంకారపు రాజు,తవుటు రాజలింగం, సందవేని రాజు,ఆసాని రామలింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఫోన్ టాంపరింగ్ వల్లే కేటీఆర్ గెలుపొందారు

**సూర్య సిరిసిల్ల టౌన్**



ఫోన్ టాంపరింగ్ వల్లే సిరిసిల్లాలో కేటీఆర్ ఎమ్మెల్యేగా గెలవడం జరిగిందని కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల పట్టణ నాయకులు ఆరోపించారు. సిరిసిల్ల ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్,ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు,రాష్ట్ర నాయకుడు వైద్య శివప్రసాద్లు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఫోన్ టాంపరింగ్ సంచలన రేపుతోందని,సిరిసిల్లలో కేకే మహేందర్ రెడ్డి ఓటమికి ఫోన్ టాంపరింగ్ కారణమని కేకే మహేందర్ రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేస్తే బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య ఎందుకు ఉలిక్కిపడుతున్నాడో అర్థం కావడం లేదన్నారు.ఫోన్ టాంపరింగ్ పై పోలీసులు విచారణ చేపట్టి నిజాలు నీకు తేలుస్తారని అన్నారు.కేటీఆర్ సిరిసిల్లలో ఓడిపోతున్నట్లు ఇంటెలిజెన్స్ వర్గాలు తెలపడంతో కేకే మహేందర్ రెడ్డి ఫోన్ ను ట్యాంపరింగ్ చేసి ఓటమికి కారకుడయ్యాడని త్వరలోనే ఈ నిజాలని బయటపడతాయని వారు గుర్తు చేశారు.కేకే మహేందర్ రెడ్డి గురించి మాట్లాడే నైతిక హక్కు బిఆర్ఎస్ పార్టీ నాయకులకు లేదని అన్నారు. త్వరలోనే బిఆర్ఎస్ నాయకులు కబ్జాలకు పాల్పడ్డ భూములన్ని బయటకు తీస్తామని వారి అవినీతిని బట్టబయలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి మ్యాన ప్రసాద్,జిల్లా నాయకులు వంగ మల్లేష్,పట్టణ ఉపాధ్యక్షులు రఫిక్,గొల్లపల్లి పరుశురాం,జిల్లా ఉపాధ్యక్షులు అఫ్ఫాన్ పాల్గొన్నారు.

## మూడు నెలలకు స్వగ్రామం చేరిన వలస కార్మికుని మృతదేహం

**సూర్య. ఇల్లంతకుంట**



మండలం లోని ఓగులాపూర్ గ్రామానికి చెందిన బైరీ వెంకటేష్ (40)అనే వలస కార్మికుడి మృత దేహం మూడు నెలలకు స్వగ్రామానికి బుధవారం చేరింది. బతుకు దెరువుకై ఇరాక్ దేశానికి వెళ్లగా గత డిసెంబర్ 29 న రోడ్డు ప్రమాదం లో మృతి చెందగా, కంపెనీ యాజమాన్యం నిర్లక్ష్యంతో మూడు నెలలుగా ఇరాక్ లోనే మృత దేహం వుంది.కుటుంబ సభ్యులు తీవ్ర ప్రయత్నాలు చేయగా ఎట్టకేలకు మృత దేహం చేరుకోగా శవ పెటిక పై పడి కుటుంబ సభ్యులు,బంధువులు గ్రామస్థుల రోధనలు మిన్నంటాయి.భార్య సౌమ్య, కూతురు జానూ లున్నారు.విషయం తెలుసుకున్న ఎంపిపి ఉట్కూరి వెంకటరమణారెడ్డి గ్రామానికి చేరుకొని మృతుడి కుటుంబాన్ని ఓదార్చి, భరోసా కల్పించాడు. ఆయన వెంట నాయకులు వున్నారు.

## ఎంపీ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీని చిత్తుగా ఓడిస్తాం

**సూర్య ముస్తాబాద్**



మొన్న జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యేలు గా గెలిచిన మాదిగ బిడ్డలకు అన్యాయము జరిగిందని, ఏ ఒక్కరికి మంత్రి పదవి ఇవ్వకపోవడం,చాలా బాధాకరమని మాదిగ రాష్ట్ర దళిత నాయకుడు కొమ్మెట రాజు అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో పనిచేసే మాల ఎమ్మెల్యే నాయకులకే మంత్రి పదవులు,స్పీకర్ పదవులు ఇవ్వడము, కాంగ్రెస్ పార్టీలో పనిచేసే మాదిగలకు ఒక్క మంత్రి పదవి ఇవ్వకపోవడం చాలా బాధాకరమని, జరగబోయే పార్లమెంట్ ఎన్నికలలో కూడా మాదిగలకు ఎంపీ సీట్లు కేటాయించకపోవడం మాదిగలపై కక్ష్య సాధింపు దిశగా కాంగ్రెస్ పార్టీ సీఎం రేవంత్ రెడ్డి సర్కార్ పనిచేస్తుందని, ఎస్సీ రిజర్వుడు స్థానాలు ఒకే మాల సామాజిక వర్గానికి మూడు ఎంపీ సీట్లు కేటాయించడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాము. రాష్ట్రవ్యాప్తంగా మాల జనాభా కంటే మాదిగల జనాభా సంఖ్య ఎక్కువ,మాదిగల%శీ%తా ఏకమై ఎంపీ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీకి ఓటుతో సరైన బుద్ధి చెప్తామని,ప్రతి జిల్లా,మండల కేంద్రానికి, గ్రామగ్రామాన తిరిగి కాంగ్రెస్ పార్టీ నుంచి నిలబడ్డా ఎంపీ అభ్యర్థిని చిత్తుచిత్తుగా ఓడిస్తామని ఈ సందర్భంగా వారు అన్నారు.

## భూమి, భుక్తి, మాతృ జాతి విముక్తి కై పోరాడిన దొడ్డి కొమురయ్య

**- జడ్పీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు.**

**సూర్య.ఇల్లంతకుంట**



భూమికోసం, బుక్తి కోసం, మాతృ భూమి కోసం పోరాడింది దొడ్డి కొమురయ్య అని రాజన్న సిరిసిల్ల జడ్ పి వైస్ చైర్మన్ సిద్ధం వేణు అన్నారు. బుధవారం మండలం లోని పోతూర్ గ్రామంలో కురుమ సంఘం జిల్లా విద్య కమిటీ అధ్యక్షులు పోలె శ్రీనివాస్ ఆధ్వర్యంలో దొడ్డి కొమురయ్య గారి 92వ జయంతి వేడుకలను నిర్వహించారు.ప్రధాన కూడలిలో ఏర్పాటు చేసిన ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘననివాళులు అర్పించారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు.ఈ కార్యక్రమంలో ఇరు బీరయ్య,లింగయ్య,పోలె ఎల్లయ్య, బైరినవీన్,పోలె శివ, ఇరుమాళ్ళ నర్సయ్య, హనుమండ్లు, పోలె కొమురయ్య ,పోలే శీను, గుంటి శ్రీకాంత్,నాయకులు, కురుమ సంఘ సభ్యులు వున్నారు.

# కాళేశ్వరం ప్రాజెక్టును బదనాం చేయాలన్నదే కాంగ్రెస్ కుట్ర

**- ఒక్క పిల్లర్ కుంగితే ప్రాజెక్టు పనికి రాదనడం అవివేకమే**

**- కాంగ్రెస్ మంచి పాలన ఇస్తదని ఆశిస్తే రైతులను అరిగోస పెడ్తాండ్లు - జిల్లా పరిషత్ చైర్మన్ పుట్ట మధూకర్**

**సూర్య-పెద్దపల్లి రూరల్**

కాళేశ్వరం ప్రాజెక్టును చిన్న చేసి ప్రాజెక్టునే బదనాం చేయాలని కాంగ్రెస్ కుట్రలు చేస్తోందని, ప్రాజెక్టులో ఒక్క పిల్లర్ కుంగితే ప్రాజెక్టు పనికి రాదని మాట్లాడటం అవివేకమని జిల్లా పరిషత్ చైర్మన్ పుట్ట మధూకర్ అన్నారు. బుధవారం రాఘవపూర్ లోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆరు గ్యారెంటీల పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సర్కార్‌వి ఆరు గ్యారెంటీలు కావని అరు వందల అబద్దాలని ఎద్దేవా చేశారు. ఎన్నికల సమయంలో అనేక హామీలు ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక ఆ హామీలను నెరవేర్చడంలో విఫలం అయ్యారని అన్నారు. ఒక్క పిల్లర్ కుంగిపోతే మనిషి వెన్నెముఖ పోయినట్లేనని, ఇక మనిషి జీవితం ఎలా పనికి రాదో అదే రీతిలో ప్రాజెక్టు పనికి రాదని అంటున్నారని ఆయన వివరించారు. మనిషి వెన్నెముక పోతే సాంకేతిక పరిజ్ఞానంతో వెన్నెముఖ ను ఏర్పాటు చేసి నడిపించే రోజులు ఉన్న క్రమంలో పూర్తిగా అవగాహన లేకుండా మాట్లాడటం విడ్డూరమన్నారు. పూర్వం గ్రామాల్లో చెరువు కట్ట, తూము, మత్తడికి



గండి పడితే ఇసుక సంచులు వేసి కాపాడుకున్నామని, అదే రీతిలో ప్రాజెక్టులో ఒక్క పిల్లర్ కుంగిపోతే తాత్కాలిక మరమ్మత్తులు చేసి వినియోగంలోకి తీసుకురావాల్సి ఉండగా ప్రాజెక్టు పనికి రాదంటూ నీళ్లు లేకుండా చేసి రైతులను ఆగం చేస్తున్నారని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో చెరువులను కాపాడామని, ఇసుక బస్తాలువేసి నీళ్లను మళ్లించామని తెలిపారు. బావితరాల భవిష్యత్ కోసం మాజీ సీఎం కేసీఆర్ ఆలోచన చేశారని ఆయన గుర్తుచేశారు. మంచి పాలన అందిస్తారని ఎంతో ఆశతో కాంగ్రెస్ పార్టీకి ఓటువేసి అధికారం ఇస్తే రైతులను అరిగొసపెడుతాండ్లని ఆవేదన వ్యక్తం చేశారు. సాగునీరు ఇవ్వకుండా ప్రాజెక్టుకు మరమ్మత్తులు చేయకుండా రైతుబంధు సకాలంలో ఇవ్వకుండా కాంగ్రెస్ ప్రభుత్వం , సీఎం రేవంత్‌రెడ్డి రైతులను ఆగం చేస్తున్నారని ఆయన వాపోయారు. డిసెంబర్ మాసంలో ఇవ్వాల్సిన రైతు బంధు నేటికి పూర్తిస్థాయిలో ఇవ్వలేదని, ఎన్ని ఎకరాలకు ఇస్తారో స్పష్టత ఇవ్వడం లేదన్నారు. పెద్దపల్లి జిల్లాలో ఇంకా సుమారు ఎనిమిది వేల మంది రైతులకు రైతుబంధు రావాల్సి ఉందని ఆయన చెప్పారు. పంటలకు సాగునీరు ఇవ్వకుండా రైతు బంధు పైసలు వేయకుండా రైతులను ఇబ్బందులకు గురిచేస్తు న్నారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం, పాలకులు అబద్దాలతో ముందుకు సాగుతున్నారని ఆయన విమర్శించారు. సాగునీరు ఇవ్వకుండా పంటలు ఎండబెట్టి రైతులకు నష్టం చేసిన పాలకులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా గ్రంధాలయ చైర్మన్ రఘువీర్ సింగ్ , కమాన్పూర్ మాజీ మార్కెట్ చైర్మన్ పూదరి సత్యనారాయణ గౌడ్ లు ఉన్నారు.

# శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలకు అధికారులు సమన్వయంతో పనిచేయాలి

**- కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి**

**సూర్య , ఇల్లందకుంట**



శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అధ్యక్షతన బుధవారం కలెక్టర్ కార్యాలయంలోని ఆడిటోరియం నందు సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో అపర భద్రాద్రిగా పేరుగాంచిన ఇల్లందకుంట శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో శ్రీరామనవమిని పురస్కరించుకొని జరిగే బ్రహ్మోత్సవాలలో భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఉండేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని భక్తుల సౌకర్యార్థం త్రాగునీరు, చలువ పందిళ్లు ఏర్పాటు చేయాలని అంతేకాకుండా అత్యవసర సేవలకై వైద్య, విద్యుత్, పోలీస్ శాఖ అధికారులు కూడా సమన్వయంతో పనిచేసి బ్రహ్మోత్స వాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమీక్షా సమావేశంలో ఇల్లందకుంట శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయ కార్య నిర్వహణ అధికారి కందుల సుధాకర్, జమ్మికుంట రూరల్ సీఐ కిషోర్ , ఇల్లందకుంట ఎస్ఐ రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# బైండోవర్ నిబంధనలను ఉల్లంఘించిన వ్యక్తికి లక్ష రూపాయల జరిమానా

**- అక్రమంగా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు**

**- వేములవాడ డీఎస్పీ నాగేంద్రచారి**

**సూర్య వేములవాడ/కోనరావుపేట**



అక్రమ ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని వేములవాడ డీఎస్పీ నాగేంద్ర చారి అన్నారు.గత సెప్టెంబర్ నెలలో కోనరావుపేట మండలం కనగర్తి మూలవాగు నుండి పల్లిమక్తకు చెందిన అలిపిరి అదిరెడ్డి అక్రమంగా ఇసుకను రవాణా చేస్తుండగా పట్టుకొని పోలీసులు కేస్ నమోదు చేసి తహశీల్దార్ ముందర లక్ష రూపాయల పూచీకత్తుతో బైండోవర్ చేశారు.అదే వ్యక్తి నిబంధనలు ఉల్లంఘించి ఫిబ్రవరి నెలలో సుద్దాల లో అక్రమ ఇసుక రవాణా చేస్తుండగా పోలీసులు పట్టుకొని కేస్ నమోదు చేసి తహశీల్దార్ ముందు హాజరు పర్చగా నిబంధనలు ఉల్లంఘించినందున లక్ష రూపాయల జరిమానా విధించినట్లు డీఎస్పీ నాగేంద్ర చారి తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఎవరైనా అక్రమ ఇసుక రవాణా చేపట్టినట్లయితే ప్రజా ఆస్తి నష్టం చట్టం (PDPP ACT) క్రింద కేసులు నమోదు చేసి ఇసుక రవాణాకు ఉపయోగించే ట్రాక్టర్ ను కోర్టు నందు డిపాజిట్ చేసి, ట్రాక్టర్ ఓనర్ మరియు డ్రైవరును రిమాండ్ చేస్తామని అన్నారు. బైండోవర్ నిబంధనల ఉల్లంఘన క్రింద తగు జరిమానా విధించబడునని తెలిపారు.

# రూరల్ పోలీసుల కస్టడీలో మాజీ చింతకుంట సర్పంచ్ ప్రస్తుత కొత్తపల్లి జెడ్పీటీసీ భర్త పిట్టల రవీందర్

**సూర్య కరీంనగర్ ప్రతినిథి**



నకిలీ ధ్రువపత్రాలు సృష్టించడమే గాక, బాధితుని భూఆక్రమణ కు పాల్పడిన మాజీ చింతకుంట సర్పంచ్, ప్రస్తుత కొత్తపల్లి జెడ్పీటీసీ భర్త పిట్టల రవీందర్ ను గత నెల 26వ తేదీన అరెస్టు చేసి రిమాండుకు తరలించిన విషయం విధితమే. కేసుకు సంబంధించిన మరింత సమాచారం సేకరించే దుకుగాను, విచారణ కొరకై, కోర్టు ద్వారా 48 గంటల మంగళవారం ఉదయం 10 గంటలనుండి గురువారం ఉదయం 10 గంటల వరకు పోలీసు కస్టడీకి తీసుకున్నామని కరీంనగర్ రూరల్ పోలీస్ ఇన్స్పెక్టర్ ప్రదీప్ కుమార్ తెలిపారు.కస్టడీలోకి తీసుకున్న పిట్టల రవీందర్ నుండి మరింత విలువైన సమాచారం సేకరించేందుకుగాను అతని ఇంటిలో సోదాలు నిర్వహించిన రూరల్ పోలీసులు పలు కీలక డాకుమెంట్లను స్వాధీన పరుచుకున్నారని తెలిపారు.

# జగిత్యాలలో దారుణం



**- తెల్లవారితే కుమారుడి పుట్టువెంట్రుకలు**

**- అనుమానస్పద స్థితిలో తల్లి మృతి**

**- భర్తే చంపాడని మృతురాలి కుటుంబ సభ్యుల ఆరోపణ**

**సూర్య జగిత్యాల**

తెల్లవారితే కుమారుడి పుట్టువెంట్రుకల వేడుకలు ఉండగా అనుమానస్పద స్థితిలో తల్లి మృతి చెందిన సంఘటన జగిత్యాల పట్టణంలో బుధవారం జరిగింది. జగిత్యాల దేవిశ్రీ గార్డెన్ వద్ద నివాసం ఉండే కాళ్ళ సుధారాణి అనుమానస్పద స్థితిలో మృతి చెందగా భర్త రంజిత్ చంపాడు అని సుధారాణి కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. డిఎస్పీ రఘు చందర్ తెలిపిన వివరాల ప్రకారం ధర్మపురి మండలం తిమ్మాపూర్ కు చెందిన సుధారాణి గొల్లపల్లి మండలం గుంజ పడుగు కు చెందిన రంజిత్ గత 4 సంవత్సరాల క్రితం ప్రేమించి కులాంతర వివాహం చేసుకున్నారు. ప్రస్తుతం జగిత్యాలలో నివాసం ఉంటున్నారు. వీరికి కుమారుడు జన్మించగా గురువారం పుట్టువెంట్రుకల వేడుకలు జరపడం కోసం ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. అయితే ఎస్సి సామాజిక వర్గానికి చెందిన మృతురాలి తరుపు బంధువులు వేడుకలకు హాజరు కావద్దంటూ అత్తింటి వారు వేదిస్తున్నారని, ఈ క్రమంలో గొడవ జరుగగా అంతలోనే తమ కుమార్తె చనిపోయిందని, ఆమె





మృతికి ఆమె భర్త, అత్తింటి వారే కారణం అని మృతురాలి తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు. కాగా ఎస్సి సామాజిక వర్గానికి చెందిన సుధారాణి కుటుంబ సభ్యులు రాకూడదంటూ రెండు కుటుంబాల మధ్య ఇటీవల గొడవ జరిగినట్టు మృతురాలి కుటుంబ సభ్యులు తెలిపారు. అక్కడే ఉన్న సుధా రాణి భర్త రంజిత్ పై దాడికి యత్నం చేయగా పోలీసులు అడ్డుకుని రంజిత్ ను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.

# భారతదేశం ఒక గొప్ప సెక్యులర్ భావాలు కలిగి ఉన్న దేశం

**- బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్ కుమార్ - ఇఫ్తార్ విందుకు హాజరైన ఎమ్మెల్యే గంగుల కమలాకర్**

**సూర్య కరీంనగర్ ప్రతినిథి**

భారతదేశం ఒక గొప్ప సెక్యులర్ భావాలు కలిగి ఉన్న దేశమని బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్ కుమార్ అన్నారు. కరీంనగర్ లోని ఎన్ ఎన్ గార్డెన్ లో బుధవారం సాయంత్రం నిర్వహించిన ఇఫ్తార్ విందు కార్యక్రమంలో ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మేయర్ సునీల్ రావు, మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ లతో కలిసి బీఆర్ఎస్ కరీంనగర్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్ కుమార్ హాజరయ్యారు.ఈ



సందర్భంగా బోయినపల్లి వినోద్ కుమార్ మాట్లాడుతూ భారతదేశం ఒక గొప్ప సెక్యులర్ భావాలు కలిగి ఉన్న దేశమని, ఇంత గొప్ప రాజ్యాంగం లో బతగడం గర్వంగా ఉందన్నారు. అన్నీ వర్గాల ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత అన్నీ రకాలుగా తీర్చిదిద్దడం జరిగిందని అన్నారు. రాబోయే వర్షాకాలంలో బాగా వర్షాలు కురిసి ప్రజలంతా సుభిక్షంగా ఉండాలన్నారు.ఈ కరీంనగర్ నగరాన్ని ఎలాంటి వైషమ్యాలు, అలజడి లేకుండా తీర్చిదిద్దుతామని అన్నారు. కరీంనగర్ నగరాన్ని స్మార్ట్ సిటీగా చేసి అభివృద్ధి చేయడం జరిగిందని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో కరీంనగర్ ను ఒక విద్యా హబ్ గా మార్చేందుకు కృషి చేస్తానని అన్నారు. యువత కోసం స్కిల్ డెవలప్ మెంట్ సెంటర్లను ఏర్పాటు చేయించి ఇతర దేశాలకు వెళ్లిన కూడా ఉద్యోగాలు చేసుకుని బ్రతికేలా చేస్తామన్నారు.



ప్రతి ఒక్కరికి మంచి జరగాలని ఆకాంక్షించారు.. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవి.రామకృష్ణ రావు, పట్టణ అధ్యక్షుడు చల్ల హరిశంకర్ మౌలానా కాజా అలీమొద్దీన్,రభాని, కమాలోద్దీన్, సర్వర్, నసీమోద్దీన్, నిస్సారొద్దీన్, హామీదోద్దీన్, మహ్మద్ అఫ్జల్, సయ్యద్ అక్బరుద్దీన్, జమీలోద్దీన్, నయామోద్దీన్, షేక్ నబి, ఖాధిరోద్దీన్, రాజిద్, షౌకత్, తదితరులు పాల్గొన్నారు.

# ఇల్లందకుంటలో బ్రహ్మోత్సవాలు వైభవంగా జరిగేలా సకల సౌకర్యాలు కల్పించండి

**- జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి - భక్తులు ఇక్కట్లు పడకుండా చూడండి - అధికారులు పకడ్బందీ చర్యలు తీసుకోవాలి**

**సూర్య కరీంనగర్ ప్రతినిధి**

ఇల్లందకుంటలోని శ్రీ సీతా రామచంద్ర స్వామి దేవస్థానంలో ఈనెల 15 నుంచి 27వ తేదీ వరకు జరగనున్న బ్రహ్మోత్సవాలకు భక్తులు మెచ్చే విధంగా అన్ని ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అధికారులను ఆదేశించారు. ఇందులో ప్రధాన ఘట్టం శ్రీరామనవమి రోజున 17వ తేదీన సీతారాముల కళ్యాణ మహోత్సవం వైభవంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. కరీంనగర్ కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో ఇల్లందకుంట శ్రీ సీతా రామచంద్ర స్వామి దేవస్థానంలో నిర్వహించ నున్న బ్రహ్మోత్సవాలు, శ్రీరామనవమి వేడుకల సందర్భంగా చేపట్టాల్సిన ఏర్పాట్లపై బుధవారం అన్ని శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన కోఆర్డినేషన్ మీటింగ్ జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పకడ్బందీగా ఏర్పాట్లు చేపట్టాలని అధికారులకు సూచనలు చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎండాకాలం నేపథ్యంలో శ్రీరామనవమి వేడుకలకు హాజరయ్యే భక్తులకు సకల సౌకర్యాలు కల్పించాలని సూచించారు. స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులు ఇబ్బందులు పడకుండా చూడాలని తెలిపారు. చలువ పందిళ్ళ, క్యూ లైన్లు, బారికేడ్లు, పార్కింగ్ స్థలాలు



ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. తాగునీటికి ఇబ్బందులు పడకుండా ప్రత్యేక దృష్టి సారించాలని, నల్లాలు, వాటర్ ట్యాంకర్లు అందుబాటులో ఉంచాలని తెలిపారు. వైద్య సిబ్బంది మందులను అందుబాటు లో ఉంచాలని సూచించారు. 108, 104 వాహనాలను సిద్ధంగా ఉంచాలని పేర్కొన్నారు. బ్రహ్మోత్సవాలకు హాజరయ్య భక్తులు ఇబ్బందులు లేకుండా వెళ్లేందుకు రోడ్ల నిర్మాణం చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఎక్కడికక్కడ భక్తుల కోసం పోలీస్ శాఖ ప్రత్యేకంగా బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. విద్యుత్ శాఖ అధికారులు నిరంతరం విద్యుత్ ను సరఫరా చేయాలని, అగ్నిమాపక సిబ్బంది అందుబాటులో ఉండాలని పేర్కొన్నారు. కోనేరు వద్ద గజ ఈతగాలను మత్స్య శాఖాధికా రులు ఏర్పాటు చేయాలని తెలిపారు. ఆలయ పరిసరాలు ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకోవాలని, ఈ మేరకు పారిశుధ్య పనులు చేపట్టాలని పేర్కొన్నారు. రైస్ మిల్లర్స్ ఆధ్వర్యంలో భక్తులు ఇబ్బందులు పడకుండా అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేయాలని తెలిపారు. ఆర్టీసీ అధికారులు భక్తులకు అవసరమైన బస్సులను ఇల్లందకుంట వరకు నడిపించాలని సూచించారు. 17న సీతారాముల కళ్యాణం, 24న జరిగే పెద్ద రథం కార్యక్రమానికి భక్తులు లక్షలాదిగా తరలివచ్చే అవకాశం ఉందని, వారికి ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అధికారులకు సూచించారు. చేపట్టాల్సిన ఏర్పాట్లు, పనులపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ప్రఫుల్ దేశాయ్, లక్ష్మి కిరణ్, డీఆర్ఓ పవన్ కుమార్, జడ్పీ సీఈవో శ్రీనివాస్, డీపీఓ రవీందర్, జిల్లా వైద్యాధికారి సుజాత, ఆర్డబ్ల్యూఎస్ ఈఈ అంజన్ రావు, కరీంనగర్, హుజురాబాద్ ఆర్డీవోలు కే మహేశ్వర్, రమేష్ బాబు, ఇల్లందకుంట ఆలయ ఈవో కే సుధాకర్, పోలీస్ అధికారులతో పాటు వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఉద్దెర మాటలు..కాంగ్రెస్ అడ్డగోలు అబద్దాల హామీలు

**- కరీంనగర్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్ కుమార్**

**సూర్య గంగాధర / కరీంనగర్ ప్రతినిధి**



కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్దెరమాటలు చెప్పి...అడ్డగోలు అబద్దాల హామీలు ఇచ్చి ఇప్పుడు అమలు చేయడం లేదని కాంగ్రెస్ అంటేనే అబద్దాల పుట్టని కరీంనగర్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్ కుమార్ అన్నారు.చొప్పదండి నియోజకవర్గములోని గంగాధర మండల కేంద్రంలో బీఆర్ఎస్ మండల పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా బోయినపల్లి వినోద్ కుమార్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాదనే ఉద్దేశ్యంతో అడ్డగోలుగా ఉద్దెర హామీలు ఇచ్చిందని..తీరా ఇప్పుడు అధికారంలోకి వచ్చాక అమలు చేసేందుకు ఆగమవుతున్నారని పేర్కొన్నారు.రైతుభరోసా ద్వారా 15000ల సాయం, కళ్యాణాలక్ష్మి,షాదీముబారక్ పథకాలకు లక్షతో పాటు తులం బంగారం, ప్రతి మహిళకు 2500ల సాయం , రైతు రుణమాఫీ 2లక్షలు ఏమైందన్నారు.ఈ యాసంగి పంటకు క్వింటాలుకు 500ల భోనస్ ఇవ్వాలని, ప్రభుత్వం రైతులకు భోనస్ ఇచ్చే వరకు రైతులతో కలిసి ఆందోళనలు చేస్తామని అన్నారు.తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ఎండిపొలాల బాట పెట్టె సరికి సీఎం రేవంత్ రెడ్డి కి భయం మొదలైందని...ఇన్ని రోజులు నీళ్లు లేవని ఇప్పుడు. కేసీఆర్ బయటకు రాగానే గాయత్రి పంప్ హౌస్ లో మోటార్లు ఎలా నడుపుతున్నారని అన్నారు. మేడిగడ్డ బ్యారేజ్ పిల్లర్లను ఇన్ని రోజులు ఎందుకు రిపేర్ చేయలేదని...బీఆర్ఎస్ పై బురదజల్లే ప్రయత్నం చేద్దామని కాంగ్రెస్ ప్రయత్నం బెడిసికొట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవి.రామకృష్ణ రావు, మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, ఎంపీపీ శ్రీరామ్ మధు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు నవీన్ రావు, పీఏసీఎస్ చైర్మన్ బాలగౌడ్, పార్టీ సీనియర్ నాయకులు , ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్ లు తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత వృత్తి శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలి

**- సేవా అధ్యక్షురాలు నరేంద్ర అలివేణి-సుధాకర రావు**

**సూర్య, సెంటినరీ కాలనీ**



సింగరేణి సేవా సమితి ద్వారా నిర్వహించే పలు ఉచిత వృత్తి శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకొని, స్వయం ఉపాధి పొందాలని ఆర్జీ-3 సేవా అధ్యక్షురాలు నరేంద్ర అలివేణి-సుధాకర రావు అన్నారు. గురువారం సెంటినరీ కాలనీ లోని సేవా భవనం నందు టైలరింగ్, మగ్గం వర్క్స్, ఫ్యాషన్ డిజైనింగ్, జ్యూట్ బ్యాగ్ తయారీ, బ్యూటీషియన్ మొదలగు విభాగాలలో సెంటినరీ కాలనీ లోని సేవా భవన్, రత్నాపూర్, జూలపల్లి, లద్నాపూర్, కలవచర్ల, లొంకకేసారం నందు నిర్వహించిన వివిధ ఉచిత వృత్తి శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమానికి సేవా అధ్యక్షురాలు నరేంద్ర అలివేణి-సుధాకర రావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. 2023-24 సంవత్సరంలో వివిధ విభాగాలలో మొత్తం 11 బ్యాచ్ ల నిరుద్యోగ మహిళలకు ఉచిత నైపుణ్యాభివృద్ధి శిక్షణను ఇవ్వడం జరిగిందని అన్నారు. ఈ శిక్షణను మహిళలందరూ సద్వినియోగం చేసుకొని స్వయం ఉపాధి పొందుతూ ఆర్థికంగా బలపడాలన్నారు. సింగరేణి సంస్థ ఉద్యోగుల కుటుంబాల మహిళలతో పాటు పరిసర గ్రామాల నిరుద్యోగ మహిళల కోసం ఇలాంటి ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు నిర్వహిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా 2022-23 ఆర్థిక సంవత్సరంలో సింగరేణి సేవా సమితి ద్వారా నిర్వహించిన వివిధ నైపుణ్యాభివృద్ధి కోర్సులలో శిక్షణ పొంది సంబంధిత పరీక్షలో ఉత్తీర్ణులైన మహిళలకు ధృవపత్రాలను అందచేశారు. అనంతరం శిక్షణ పొందిన మహిళలు, శిక్షకురాలు వారి అభిప్రాయాలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పర్సనల్ మేనేజర్ ముప్పిడి రవీందర్ రెడ్డి, కోఆర్డినేటింగ్ అధికారి గుర్రం శ్రీహరి, డివైపిఎం సునీల్, సేవా సంయుక్త కార్యదర్శి ఉమాదేవి, సేవా సమితి సమన్వయ కర్త బి.రాయమల్లు, కే.సుధాకర్ లతోపాటు సేవా సభ్యులు, శిక్షకులు, మహిళలు పాల్గొన్నారు.

# వెంకటేశ్వర పల్లిలో ఘనంగా పోచమ్మ తల్లికి బోనాలు

**సైదాపూర్ / కరీంనగర్ ప్రతినిధి**

సల్లంగా సూడో పోచమ్మ తల్లో అంటు కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలం వెంకటేశ్వరపల్లేలో కులాలకు అతీతంగా పెద్ద ఎత్తున పోచమ్మ తల్లికి బుధవారం బోనాలు సమర్పించారు.ఈ సందర్భంగా గ్రామ పెద్దల సమక్షంలో ప్రతి గడప నుండి మహిళలు బోనం ఎత్తుకోని డప్పు చప్పుళ్ల శివసత్తుల పునకాలు, బైండ్ల వారి ఆటల మధ్య పోచమ్మ తల్లి ఆలయానికి చేరుకోని అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పంటలు బాగ పండాలని, గొడ్డుగొద సల్లంగా ఉండాలని ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని పోచమ్మ తల్లికి ప్రత్యేక పూజలు



నిర్వహించారు.వెంకటేశ్వర పల్లే పోచమ్మ బోనాల పండుగకు చూట్టు పక్కల గ్రామాలనుండి పెద్ద ఎత్తున బంధువులు తరలిరావటంతో గ్రామంలో పండుగ వాతవారణం నేలకోంది. మండుటెండను సైతం లేక్క చేయకుండా చిన్న పెద్ద తేడా లేకుండా అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు.శివసత్తుల పునాకాలు, బైండ్ల వారి ఆటలు చూపరులను ఎంతగానో అకట్టుకున్నాయి.ఎక్కడ లేని విధంగా కులాలకు అతీతంగా ప్రతి 3సంవత్సరాలకు ఒక్కసారి పోచమ్మకు బోనాల పండుగను ఘనంగా నిర్వహిస్తామని గ్రామ పెద్దలు తెలిపారు. భవిశ్యత్ లో గ్రామంలో జరిగే గ్రామ దేవతల పండగలను ఆందరం కలిసికట్టుగా ఐక్యతగా నిర్వహిస్తామని చెప్పారు.బోనాల పండుగ విజయవంతానికి కృషి చేసిన అందరికి గ్రామ పెద్దలు కృతజ్ఞతలు తెలిపారు.

## ప్రతి ఒక్కరు ఓటు హక్కు వినియోగించుకోవాలి

**- తహసిల్దార్ జాహెద్ పాషా.**

**సూర్య కాల్వ శ్రీరాంపూర్**



ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ సుపరి పాలన కోసం తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కాల్వ శ్రీరాంపూర్ తాహసిల్దార్, గంగారం, లక్ష్మీపురం గ్రామాల ప్రత్యేకాధికారి జాహెద్ పాషా అన్నారు. బుధవారం కాల్వ శ్రీరాంపూర్ మండలంలోని గంగారం, లక్ష్మీపూర్ గ్రామాల్లో ప్రత్యేకంగా ఓటు హక్కు నమోదుపై ఏర్పాటుచేసిన అవగాహన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండి ఓటు హక్కు లేని వారు ఫామ్ 6 ద్వారా ఈనెల 15 వరకు దరఖాస్తు చేసుకోవాలని, అదేవిధంగా వికలాంగులు, వృద్ధులు ఫామ్ డి ద్వారా ఇంటి వద్దనే ఓటు వేసే విధానాన్ని వినియోగించుకోవాలన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ద్వారా మంచి నాయకత్వాన్ని ఎన్నుకునే అవకాశం భారత రాజ్యాంగం కల్పించిందని ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకునేవారు స్థానిక బిఎల్ ఓ లకు కాని తాహసిల్దార్ కార్యాలయంలో ఫారములు అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు మామిడి రమేష్, పి శ్రీనివాస్, బి ఎల్ ఓ లు, అంగన్వాడి టీచర్లు, ఏఎన్ఎం లు, ఆశ వర్కర్లు, గ్రామపంచా యతీ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

## సింగరేణి అభివృద్ధి లో సూపర్వైజర్లది కీలక పాత్ర

**సూర్య, సెంటినరీ కాలనీ**



సింగరేణి సంస్థ అభివృద్ధిలో కార్మికులతో పాటు సూపర్వైజర్లది అత్యంత కీలకమైన పాత్రని, సంస్థ స్థితిగతులను కార్మికులకు వివరిస్తూ సంస్థ పురోభివృద్ధికి మరింత అంకితభావంతో పని చేయాలని ఓసీపీ-1 ప్రాజెక్ట్ ఆఫీసర్ నలజాల రాధాకృష్ణ కోరారు. ఆర్జీ-3 డివిజన్ ఓసిఎం-1 కాన్ఫరెన్స్ హాల్ నందు బుధవారం సూపర్వైజర్ల తో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ప్రాజెక్ట్ ఆఫీసర్ నలజాల రాధాకృష్ణ హాజరై మాట్లాడారు. నేటి పోటీ మార్కెట్లో సింగరేణి సంస్థ నిలదొక్కుకోవాలంటే ఉత్పాదకత మరింత పెరగాలని, దీనికోసం ప్రతి అధికారి, సూపర్వైజర్, మరియు కార్మికుడు పూర్తి పని గంటలు సద్వినియోగం చేయాల్సిన అవసరం ఉందని, ముఖ్యంగా సూపర్వైజర్లు ఉద్యోగులను చైతన్య పరుస్తూ ముందుకు నడపాలన్నారు, ఈ సందర్భంగా ఓసీపీ-1 ఉత్పత్తి వ్యయం, బొగ్గు అమ్మకం, ప్రస్తుతం ఎదుర్కొంటున్న ఆర్థిక పరిస్థితులు వంటివి కూలంకషంగా వివరించారు. సంస్థను అభివృద్ధి పథంలో నడపాలంటే ఇంకా చేపట్టాల్సిన నిర్మాణాత్మక చర్యలు సూచించాలని ఆయన సూపర్వైజర్లను కోరారు. కంపెనీని లాభదాయకంగా నడిపిస్తే కార్మికులతో పాటు సూపర్వైజర్లకు కూడా తగిన విధంగా ప్రోత్సాహకాలు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఓసీపీ-1 ప్రాజెక్ట్ ఇంజనీర్ ఆర్.శ్రీనివాస్, మేనేజర్ ఉదయ్ హరిజన్, సేఫ్టీ ఆఫీసర్ అందె కోటయ్య, వెల్ఫేర్ ఆఫీసర్ సాయి కృష్ణ, సూపర్వైజర్లు, తదితరులు పాల్గొన్నారు.

## బహుజనుల రాజ్యాధికారం కోసమే మా పోరాటం

**- దొడ్డి కొమురయ్య జయంతి సందర్భంగా పెద్దపల్లి జిల్లా పరిషత్ చైర్మన్ పుట్ట మధూకర్**

**సూర్య మంథని**



బహుజనుల రాజ్యాధికారం కోసమే మా పోరాటం కొనసాగుతూనే ఉంటుందని జిల్లా పరిషత్ చైర్మన్ పుట్ట మధూకర్ అన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య జయంతి సందర్భంగా మంథని పట్టణంలోని దొడ్డి కొమురయ్య విగ్రహానికి ఆయన పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆనాడు దొడ్డి కొమురయ్య భూస్వామ్య పెత్తం దారి వ్యవస్థపై పోరాటం చేశారని, మహనీయులు చాకలి ఐలమ్మ, జ్యోతిబావుపూలే, దొడ్డి కొమురయ్య, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ లాంటి మహనీయుల స్ఫూర్తితో తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నా వారి చరిత్రను తెలుసుకోకపోవడం బాధాకరమన్నారు. మహనీయుల స్ఫూర్తిని రిజర్వేషన్లతో ఎదిగిన నాయకులు తెలుసుకోలేక పోవడం మూలంగానే ఇంకా బానిసలుగా ఉంటున్నామని అన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో బీసీలు, ఎస్సీలకు రాజ్యాధికారం రాదనేది గత ఎన్నికల్లోనే నిరూపణ అయిందన్నారు. అంబేద్కర్ అందించిన రిజర్వేషన్లను అనుభవిస్తూ వారి స్ఫూర్తిని అర్థం చేసుకోకపోవడం మూలంగానే మూడు ఓట్లు ఉన్నోళ్లు యాభై ఏండ్లుగా పరిపాలన చేస్తున్నారని ఆయన అన్నారు. ఏప్రిల్ మాసమంతా మహనీయుల మాసమని ఈ క్రమంలో మహనీయుల స్ఫూర్తితో నియోజకవర్గంలో బలహనీవర్గాలకు రాజ్యాధికారం కోసం పోరాటం చేస్తానని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు తగరం శంకర్ లాల్, ఆరేపల్లి కుమార్, వేల్పుల గట్టయ్య, కనవేని శ్రీనివాస్, పెగడ శ్రీనివాస్ పాల్గొన్నారు.

# కాంగ్రెస్ సర్కార్ రైతాంగాన్ని మోసం చేసింది

## - బిజెపి నాయకులు, మాజీ ఎంపీపీ వాసాల రమేష్

**సూర్య కరీంనగర్ ప్రతినిధి**

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి రైతులను మభ్యపెట్టి అనేక హామీలు ఇచ్చిందని, నేడు అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని అమలు చేయడంలో విఫలమైందని, ముఖ్యంగా రెండు లక్షల రుణమాఫీ, 15వేల రైతు భరోసా ను ఎందుకు అమలు చేయలేదో రైతాంగానికి సమాధానం చెప్పాలని బిజెపి నాయకులు, మాజీ ఎంపీపీ వాసాల రమేష్ డిమాండ్ చేశారు. బుధవారం కరీంనగర్లోనీ బిజెపి జిల్లా కార్యాలయంలో అసెంబ్లీ కన్వీనర్ దూబల శ్రీనివాస్ ఆధ్వర్యంలో మీడియా సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ సాగు నీరు లేక రైతులు అల్లాడుతున్నారని, పంటలను కాపాడుకోవడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం రైతులు అనేక కష్టాల్లో ఉంటే,. రైతాంగాన్ని ఆదుకోవాల్సిన కాంగ్రెస్ ప్రభుత్వం చోద్యం చూస్తుందని విమర్శించారు. రైతన్నలు ఆరుగాలం కష్టించి పండించిన పంటకు సాగునీరు లేక నష్టపోయే పరిస్థితి వచ్చిందన్నారు. రైతులు తీవ్ర సంక్షోభంలో ఉన్నారని, భరోసా కల్పించాల్సిన ప్రభుత్వం మొద్దు నిద్రలో



ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి రైతంగంపై చిత్తశుద్ధి పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.25 వేల చొప్పున నష్టపరిహారం చెల్లించాలనీ, తక్షణమే వడ్ల కొనుగోలు కేంద్రా లను ప్రారంభించి ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు క్వింటాలుకు రూ.500 బోనస్ ప్రకటిం చాలనీ,. ఇతర పంటలకు సైతం బోనస్ అందించాలనీ , తాలు, తేమ, తరుగుతో సంబంధం లేకుండా వడ్లను ప్రభుత్వమే కొనుగోలు చేయాలనీ, ఇందిరమ్మ రైతు భరోసా కింద రైతులతోపాటు కౌలు రైతులుకు ఎకరాకు రూ.15 వేలు, భూమి లేని వ్యవసాయ కూలీలలకు రూ.12 వేలు ఇవ్వాలనీ,రైతులకు రూ.2 లక్షల రుణమాఫీని తక్షణమే అమలు చేయాలనీ,. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రైతు కమిషన్ ను ఏర్పాటు చేయాలనీ,సమగ్ర పంటల బీమా ను అమలు చేసి రైతులతోపాటు రైతు కూలీలు, భూమిలేని రైతులకు సైతం బీమా పథకాన్ని వర్తింపజేయాలనీ,కొత్త సాగు విధానంతోపాటు పంటల సమగ్ర ప్రణాళికను విడుదల చేయాలనీ బిజెపి కరీంనగర్ అసెంబ్లీ పక్షాన డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ సమావేశంలో పాల్గొన్న వారు బాస సత్యనారాయణ రావు, గుగ్గిల్లపు రమేష్,రాజేంద్రప్రసాద్, కొలగాని శ్రీనివాస్, పురం హరి,జానపట్ల స్వామి,రాగి సత్యనారాయణ, కేంచే శేఖర్,కదర్ల రతన్ కుమార్, వేముల చంద్రశేఖర్, రవీందర్ రెడ్డి,హరిప్రసాద్, చిట్టిబాబు,నర్సన్న,టౌన్ 1 ప్రభారీ పద్మయ్య పాల్గొన్నారు

# ఫర్టిలైజర్ డీలర్లకు డిప్లొమా కోర్సు

**సూర్య కోనరావుపేట**

వ్యవసాయంలో విస్తరణ విభాగాన్ని పటిష్టం చేసేందుకు, రైతులకు మరిన్ని సేవలు అందించేందుకు డిప్లొమా కోర్సు (దేశీ)ని అమలు చేస్తున్నదని రిటైర్డ్ ఏడీఏ పేరం కొమురయ్య అన్నారు. బుధవారం కోనరావుపేట మండలం ధర్మారం గ్రామంలోని దశరథ ఆర్గానిక్ ఫార్మ్ కు రిటైర్డ్ ఏడీఏ పేరం కొమురయ్య దేశీ ఫెసిలిటేటర్ ఆధ్వర్యంలో 36 మంది డీలర్లతో కూడిన శిక్షణ బృందం ను సందర్శనకు తీసుకువచ్చి ఆర్గానిక్ ఫార్మ్ యజమాని మూగల ప్రభాకర్ తో కలిసి ఈ ప్రాంతం వ్యవసాయ, ఉద్యాన పంట సాగు విధానం, సేంద్రియ ఎరువులు, సేంద్రియ సాగు విధానం, చీడపీడలు, సస్యరక్షణ చర్యలపై అవగాహన కల్పించారు. డీలర్లు క్షేత్రస్థాయిలో ఫార్మ్ లో తిరుగుతూ సందడిగా గడిపారు. ఇదో చక్కటి అవకాశమని, వినియోగించుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో భాగంగా రిటైర్డ్ ఏడీఏ మాట్లాడుతూ పెట్టుబడుల నియంత్రణ, సాగులో శాస్త్రీయ విధానాలను ప్రోత్సహించడమే లక్ష్యంగా జాతీయ విస్తరణ, నిర్వహణ సంస్థ (మేనేజ్) ఫర్టిలైజర్ దుకాణాల డీలర్లకు 'దేశీ' పేరుతో డిప్లొమా



కోర్సును ప్రారంభించిందని తెలిపారు. ఇందులో భాగంగా రాజన్న సిరిసిల్ల జిల్లాలోని మొదటి బ్యాచ్ 40 మంది డీలర్లకు 48 వారాల పాటు తరగతులతో పాటు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పిస్తున్నామని పేర్కొన్నారు. ఎరువులు, పురుగు మందుల విక్రయాల్లో ఫర్టిలైజర్ డీలర్ల పాత్ర కీలకం. చీడ పీడల నివారణకు వినియోగించే పురుగు మందులకు వచ్చే రైతులకు ఖచ్చితత్వంతో పని చేసే రసాయనాలు, ఎరువులు ఇచ్చేలా తీర్చిదిద్దడమే లక్ష్యంగా దేశీ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. శిక్షణ తరగతులు, క్షేత్ర సందర్శనలు పూర్తి చేసుకున్న డీలర్లకు డిప్లొమా కోర్సు ధ్రువపత్రాలు అందజేస్తామని తెలిపారు.

# అక్షర గురు దంపతులకు పూర్వ విద్యార్థుల బంగారు కానుక

## -10 గ్రాముల గోల్డ్ 50 వేల ఆర్థిక సహాయం

## -గురుభక్తిని చాటుకున్న ఆనాటి వెంకట్రావు పల్లి శాతవాహన విద్యానికేతన్ పూర్వ విద్యార్థులు

**సూర్య, సెంటినరీ కాలనీ**

గురు బ్రహ్మ,గురు విష్ణు, గురుదేవో మహేశ్వర అన్న పదాలను నిజం చేస్తూ ఆనాటి వెంకట్రావు పల్లి పూర్వ విద్యార్థులు గురుభక్తిని చాటుకున్నారు. ఒకప్పటి వెంకట్రావు పల్లి, ప్రస్తుతం న్యూ మారేడుపాక లో కొనసాగుతున్న శ్రీ శాతవాహన విద్యానికేతన్ లో 1989 నుండి 2023 వరకు చదువుకున్న పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం ఇటీవల న్యూ మారేడుపాకలో నిర్వహించుకున్నారు. ఆ సమ్మేళనంలో ఆనాటి తమ గురువుల పరిస్థితులు చూసి చలించిన విద్యార్థులు పాఠశాల ప్రిన్సిపాల్ ఇటీవల విద్యా రత్న అవార్డు అందుకున్న పి.వెంకట మాధవరావు, పరిమళ టీచర్ లను మంగళవారం సాయంత్రం న్యూ మారేడుపాక లోని పాఠశాల ఆవరణలో పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు. గురువులకు గురుదక్షిణగా 10 గ్రాముల రెండు బంగారు ఉంగరాలను, 50 వేల రూపాయలను అందజేశారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన



గొప్పవారిని చేసిన గురువులను కీర్తించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం కమిటీ కన్వీనర్ సాంబారి రాజేష్, మహిళ ఇంచార్జ్ మెండే లక్ష్మి, కమిటీ సభ్యులు పెండ్రీ రమణారెడ్డి, గోపు రవీందర్ రెడ్డి, కంది నాగరాజు, నాతాటి సుధాకర్ రెడ్డి, బిల్లా తిరుపతి రెడ్డి, ఇసంపల్లి రమేష్, దేవనపల్లి చక్రపాణి, నాగమణి, బత్తిని శ్రీనివాస్, రమణారెడ్డి (శ్రీరామ), ఆర్.నాగమణి, శ్రీదేవి, ఆడెపు.నగేష్, వేణు, సంపత్ కుమార్, గుండేటి రమేష్, గాయత్రి శ్రీనివాస్ ,పవన్, శ్రావణ్, తదితరులు పాల్గొన్నారు.

# సిరిసిల్ల నియోజకవర్గ కాంగ్రెస్ కోఆర్డినేటర్ గాపాశం రాజేందర్ రెడ్డి.

**సూర్య, ఇల్లంతకుంట..**



2024 పార్లమెంట్ ఎన్నికల కై ప్రచారంలో భాగ%శీ%గా సిరిసిల్ల నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ కో ఆర్డినేటర్ గా మండలం లోని పెద్దలింగాపూర్ గ్రామానికి చెందిన పాశం రాజేందర్ రెడ్డి నినియమిస్తూ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్ కుమార్ గౌడ్ నియామక పత్రాన్ని బుధవారం అందజేశారు. నియమించినదుకు పిసిసి అధ్యక్షులు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,మంత్రులు పొన్నం ప్రభాకర్ గౌడ్, శ్రీధర్ బాబు,ప్రభుత్వ విఫ్ అది శ్రీనివాస్, అడ్లూరి లక్ష్మణ్, మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వం పల్లి సత్యనారాయణ,ఏఐసీసీ కిసాన్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు కోదండ రెడ్డి, తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షులు సుంకేట్ అన్వేష్ రెడ్డి లకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై ఉంచిన నమ్మకాన్ని ఓమ్ము చేయకుండా కరీంనగర్ పార్లమెంట్ కు సంబంధించి సిరిసిల్ల నియోజకవర్గ కోఆర్డినేటర్ గా పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని గెలిపించుటకు,6గ్యారెంటీ పథకంలో భాగంగా మహిళలకు ఉచిత ప్రయాణం,200 యూనిట్ల వరకు విద్యుత్ ఉచితం, రూ.500లకే గ్యాస్,రానున్న రోజుల్లో చేపట్టేటువంటి రైతు భరోసా రైతు బీమా, రూ.500 బోనస్లు కూడా అమలు చేస్తుందని అన్నీ గ్రామాల్లోని ప్రతి ఓటరుకు వివరిస్తూ ఓటర్లను చైతన్యం చేసి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలుపుకు కృషి చేస్తానని తెలిపారు.

# సాగు, తాగునీరు పై పట్టింపు లేని కాంగ్రెస్ ప్రభుత్వం

## - బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపెల్లి శ్రీనివాస్ గౌడ్

**సూర్య, చొప్పదండి**



చొప్పదండి నియోజక వర్గంలో రైతులు సాగునీ రు కోసం, ప్రజలు త్రాగు నీరు కోసం అల్లాడు తుంటే కాంగ్రెస్ నాయకు లు ఏమాత్రం ప్రజలను పట్టించుకోవ డంలేదని బిజెపి జిల్లా ప్రధానకార్యదర్శి తాళ్లపెల్లి శ్రీనివాస్ గౌడ్ ధ్వజమెత్తారు. చొప్పదండి పట్టణంలో అసెంబ్లీ కన్వీనర్ పెరుక శ్రావణ్ అధ్యక్షతన నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పూర్తిగా వ్యవసాయం పై ఆధారపడ్డ నియోజకవర్గ ప్రజలకు సాగునీరు, తాగునీరు అందించవలసిన కాంగ్రెస్ నాయకులు రైతుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అన్నారు.ఎల్లంపల్లి ప్రాజెక్టు ద్వారా చొప్పదండి నియెజక వర్గంలోని రాగంపేట, రెవెల్లి మొదలుకొని కోడిమ్యాల మండలాల్లో ఎన్ని చెరువులు, కుంటాలు ఎన్ని నింపారో ఎమ్మెల్యే మెడిపెల్లి సత్యం స్వేతపత్రం విడుదల చేయాలన్నారు. రైతుల వరి ధాన్యానికి 22,00 కేంద్ర మద్దతు ధరకు రాష్ట్ర ప్రభుత్వం గ్యారంటీ ఇచ్చిన 500 కలిపి చెల్లించాలని లేనట్లయితే రైతులతో కలిసి ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. రైతులకు ఇచ్చినటువంటి రైతు రుణమాఫీ, పంట నష్ట పరిహారం అమలు చేయకుండా రతులను మోసం చేసిన కేసీఆర్ ఏ మొఖం పెట్టుకుని జిల్లాలో పర్యటిస్తారని ప్రశ్నించారు.ఈ కార్యక్రమంలో కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు సింగిరెడ్డి కృష్ణా రెడ్డి, బిజెపి జిల్లా కార్యదర్శి చేపూరి సత్యనారాయణ, చొప్పదండి, గంగాధర, కోడిమ్యాల, బోయినపల్లి, మాల్యాల మండలాల అధ్యక్షులు బత్తిని ప్రశాంత్, మావురం సుదర్శన్ రెడ్డి తదితరులు ఉన్నారు.

# రూరల్ పోలీసుల కస్టడీలో 7వ డివిజన్ కార్పొరేటర్ భర్త ఆకుల ప్రకాష్

**సూర్య కరీంనగర్ ప్రతినిధి**

నకిలీ ధ్రువపత్రాలను సృష్టించడమే గాక ఒకే భూమిని పలువురికి విక్రయించి, ముందుగా కొనుగోలు చేసిన విక్రయదారులను మోసం చేసిన విషయంలో 7వ డివిజన్ కార్పొరేటర్ భర్త అయిన ఆకుల ప్రకాష్



ను గత నెల 26వ తేదీన అరెస్టు చేసి రిమాండుకు తరలించిన విషయం విధితమే. కేసుకు సంబంధించిన మరింత సమాచారం సేకరించేందుకుగాను, విచారణ కొరకై, కోర్టు ద్వారా 24 గంటల బుధవారం ఉదయం 10 గంటలనుండి గురువారం ఉదయం 10 గంటల వరకు పోలీసు కస్టడీకి తీసుకున్నామని కరీంనగర్ రూరల్ పోలీస్ ఇన్స్పెక్టర్ ప్రదీప్ కుమార్ తెలిపారు.కస్టడీలోకి తీసుకున్న ఆకుల ప్రకాష్ నుండి మరింత విలువైన సమాచారం సేకరించేందుకుగాను అతని ఇంటిలో సోదాలు నిర్వహించిన రూరల్ పోలీసులు పలు కీలక డాకుమెంట్లను స్వాధీన పరుచుకున్నారని తెలిపారు.

# మోసపూరితమైన హామీలతో రైతులకు అన్యాయం చేసారు

**- బండి ని విమర్శించే హక్కు పొన్నం కు లేదు - బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బత్తుల లక్ష్మీనారాయణ**

**సూర్య తిమ్మాపూర్**

మోసపూరితమైన హామీలతో కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు అన్యాయం చేసిందని కరీంనగర్ జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి బత్తుల లక్ష్మీనారాయణ ఆరోపించారు.రైతాంగానికి ఎదురవుతున్న కష్ట, నష్టాల విషయంలో మద్దతుగా ఉండాలనే రాష్ట్ర పార్టీ పిలుపుమేరకు కార్యక్రమాలు నిర్వహిస్తున్న క్రమంలో బుధవారం తిమ్మాపూర్ మండల కేంద్రంలో నియోజకవర్గ కన్వీనర్ ముత్యాల జగన్ రెడ్డి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్బంగా ముఖ్య అతిధిగా హాజరైన లక్ష్మీనారాయణ మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోగా 6 గ్యారంటీలు అమలుచేస్తామని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ప్రజలను మోసం చేసిందని విమర్శించారు.రెండు లక్షల రుణ మాఫీ చేస్తామని ప్రకటనలు చేస్తూనే రైతులకు బ్యాంకు లు నోటీసులు పంపించడం దారుణమని పేర్కొన్నారు. పెట్టుబడి సాయం పెంచి ఇస్తామని రేపూ మాపంటూ వాయిదాలు



వేస్తుందని అన్నారు.వరి పంటకు 500 బోనస్ ఇస్తామన్న హామీ ఏమైందని ప్రశ్నించారు.కౌలు రైతులకు ఇచ్చే పెట్టుబడి గురించి ఎందుకు మాట్లాడటం లేదని అడిగారు. రైతులకిచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని కోరుతూ బండి సంజయ్ చేసిన దీక్ష తో పార్లమెంట్ పరిధిలోని రైతులు మద్దతుగా ఉన్నారని పేర్కొన్నారు.రాష్ట్ర మంత్రిగా ఉన్నటువంటి పొన్నం ప్రభాకర్ బండి సంజయ్ పై అనవసరమైన ఆరోపణలు చేస్తూ స్థాయిని తగ్గించుకుంటున్నాడని అన్నారు. కరీంనగర్ లో పోటీ చేసే ధైర్యం లేక హుస్నాబాద్ వెళ్లి పోటీ చేసి స్థానిక కాంగ్రెస్ నాయకులకు అన్యాయం చేసాడని ఆరోపించారు. కరీంనగర్ అభివృద్ధిలో బండి సంజయ్ నిధుల విషయంలో కాంగ్రెస్ నాయకులకు, పొన్నం అనుచరులకు చర్చకు వచ్చే దమ్ముందా అని ప్రశ్నించారు. ఇప్పటికైనా రైతుల పక్షాన ప్రభుత్వం ఆలోచన చేసి వెంటనే వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేసారు.మాజీ జడ్పిటీసి ఎడ్ల జోగిరెడ్డి, మాజీ ఎంపిపి దొంగల రాములు,జిల్లా ప్రధాన కార్యదర్శి మాడ వెంకట్ రెడ్డి,జిల్లా అధికార ప్రతినిధి బొంతల కళ్యాణ్ చంద్ర,కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు కరివేద మహిపాల్ రెడ్డి,రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు దండు కొమురయ్య, తిమ్మాపూర్, మానకొండూర్ మండలాల అధ్యక్షులు సుగుర్తి జగదీశ్వరాచారి, రాపాక ప్రవీణ్, జిల్లా కార్యవర్గ సభ్యులు చింతం శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శులు కిన్నెర అనిల్, గొట్టిముక్కల తిరుపతి రెడ్డి, పబ్బ తిరుపతి, బామాండ్ల రాజు తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

## కాల్వ శ్రీరాంపూర్ మండల విద్యాధికారిగా సురేందర్ కుమార్

**సూర్య కాల్వ శ్రీరాంపూర్**



కాల్వ శ్రీరాంపూర్ మండల విద్యాధికారిగా టి సురేందర్ కుమార్ బుధవారం పదవి బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేసిన ఎంఈఓ ఆరేపల్లి రాజయ్య రామగుండం కు బదిలి పై వెళ్లగా, పెద్దపల్లిలో విధులు నిర్వహిస్తున్న సురేందర్ కుమార్ కు ఉన్నతాధికారులు అదనపు బాధ్యతలు అప్పగించగా బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా నూతనంగా పదవి బాధ్యతలు చేపట్టిన ఎంఈఓ సురేందర్ కుమార్ మండల పి ఆర్ టి యు సంఘం అధ్యక్షులు కడారి నవీన్ ఆధ్వర్యంలో శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ముంజాల హరికృష్ణ గౌడ్, బండారి కుమార్, మహేష్, సతీష్, రాజు, సత్యవతి, శ్రీదేవి, శ్రీనివాస్, నలిని,సంధ్యారాణి ఎమ్మార్సీలు రమేష్, వీరన్న, చందర్, కుమార్ తదితరులున్నారు.

## నిరుపేద యువతి పెళ్లికి పద్మశాలి సంఘం రూ:88,310 సహాయం



**సూర్య, చొప్పదండి**

చొప్పదండి పట్టణంలోని నిరుపేద పద్మశాలి కుటుంబానికి చెందిన సాంబారి కావ్య వివాహానికి కరీంనగర్ పద్మశాలి సంఘం వారు 88,310 రూపాయలు ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పద్మశాలి సంఘం అధ్యక్షులు మెతుకు సత్యం, గౌరవాధ్యక్షులు వాసాల రమేష్, ప్రధాన కార్యదర్శి వల్లాల కృష్ణ హరి,పట్టణ పద్మశాలి సంఘం కరీంనగర్ అధ్యక్షులు గడ్డం శ్రీరాములు, కోశాధికారి గజ్జవెల్లి కనకయ్య, సంక్షేమ ట్రస్ట్ అధ్యక్షులు స్వర్గం మల్లేశం,ప్రధాన కార్యదర్శి అలసభద్రయ్య, చొప్పదండి మాజీ జెడ్పిటిసి ఇప్పనపల్లి సాంబయ్య,మాజీ ఎంపీపీ తవుతు మురళి, చొప్పదండి పవర్ లూమ్ అసోసియేషన్ అధ్యక్షులు ఎన్న మునీందర్, చొప్పదండి మండల పద్మశాలి సంఘం ప్రధాన కార్యదర్శి గాలి పెల్లి రమణయ్య,చొప్పదండి పద్మశాలి సంఘం అధ్యక్షులు దండే రాజయ్య, దూసకైలాసపతి పాల్గొన్నారు.

## ప్రజల దాహార్తిని తీర్చేందుకే చలివేంద్రం

**-మంథని ఆర్డీవో హనుమ నాయక్**

**సూర్య, సెంటినరీ కాలనీ**



వేసవిలో ప్రజల దాహార్తి తీర్చేందుకే కమాన్ పూర్ మండల తహసిల్ కార్యాలయం వద్ద చలివేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందని మంథని ఆర్డీవో హనుమా నాయక్ అన్నారు. బుధవారం తహసీల్ కార్యాలయం వద్ద తహసీల్దార్ ఆరిపోద్దిన్ డిప్యూటీ తహసీల్దార్ కోటేశ్వరరావు తో కలిసి చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ వేసవిని దృష్టిలో పెట్టుకొని కార్యాలయాలకు వచ్చే రైతులు ప్రజలు దారి గుండా వెళ్లే ప్రజల కోసం దాహార్తి తీర్చేందుకే చలివేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. అలాగే ప్రభుత్వ కార్యాలయాల వద్ద చలివేంద్రాలు ప్రారంభించాలని కోరారు. గిరిధవార్లు సంధాని రవీందర్, సీనియర్ అసిస్టెంట్ కె.మహేష్ బాబు, జూనియర్ అసిస్టెంట్ మల్కా రెడ్డి, రంజిత్, కృష్ణ, రాజేందర్, చిరంజీవి, శ్రీనివాస్, ధరణి, ఆపరేటర్ నగేష్, కార్యాలయ ఆపరేటర్ తోట రమేష్ మరియు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ఎల్లమ్మ కళ్యాణోత్సవంలో పాల్గొన్న సునీల్ రెడ్డి.

**సూర్య, సెంటినరీ కాలనీ**



కమాన్ పూర్ మండల కేంద్రంలో గత మూడు రోజులుగా గౌడ సంఘం కమాన్ పూర్ వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీ రేణుక ఎల్లమ్మ కళ్యాణ మహోత్సవం జరుగుతున్న సందర్భంలో బుధవారం బిజెపి పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు చందుపట్ల సునీల్ రెడ్డి రేణుక ఎల్లమ్మ తల్లిని దర్శించుకున్నారు. కమాన్ పూర్ గౌడ సంఘం పెద్దలు సునీల్ రెడ్డిని శాలువాతో సత్కరించారు. పాడి పంటలతో గ్రామాలు సుభిక్షంగా ఉండాలని, ఇలాంటి గ్రామీణ దేవత ఉత్సవాలు నిర్వహిస్తూ, మన దేశ సంస్కృతి, సాంప్రదాయాలను కాపాడాలని, ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం గ్రామీణ ప్రాంతాలకు శుభసూచకం అంటూ సునీల్ రెడ్డి తెలిపారు. వీరితోపాటు బిజెపి మండల అధ్యక్షుడు జంగపల్లి అజయ్, మట్ట శంకర్, మచ్చ గిరి రాము, మల్లారపు అరుణ్ కుమార్, కొయ్యడ సతీష్, వడ్లకొండ తిరుపతి పాల్గొన్నారు.

## నూతన వధూవరలను ఆశీర్వదించిన ఎమ్మెల్యే

**సూర్య, హుజురాబాద్**



హుజురాబాద్ పట్టణంలోని పలు వివాహాది కార్యక్రమాల్లో హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి బుధవారం హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్, పట్టణ అధ్యక్షులు కొలిపాక శ్రీనివాస్, కౌన్సిలర్ ముక్క రమేష్, నాయకులు మొలుగూరి పూర్ణచందర్, బుర్ర నటరాజ్, అఖిల్ గౌడ్, కౌశిక్ తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీగా గడ్డం వంశీకృష్ణను భారీ మెజార్టీతో గెలిపించుకుంటాం

**సూర్య, సెంటినరీ కాలనీ**



రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ పెద్దపల్లి అభ్యర్థి గడ్డం వంశీకృష్ణను భారీ మెజార్టీతో గెలిపించడానికి కృషి చేస్తామని కమాన్ పూర్ మాజీ జెడ్పిటిసి ఎల్లే శశిరేఖ, రామగిరి మండలం నాగేపల్లి మాజీ సర్పంచ్ ఎల్లె రామ్మూర్తి పేర్కొన్నారు. రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆధ్వర్యంలో స్థానిక ప్రజాప్రతినిధుల, కాంగ్రెస్ పార్టీ నాయకుల, కార్యకర్తల సహాయ సహకారాలతో వంశీకృష్ణ గెలుపు కోసం కృషి చేస్తామని తెలిపారు. గతంలో దివంగత నేత, ఉమ్మడి రాష్ట్ర శాసన సభాపతి శ్రీపాదరావు ఆధ్వర్యంలో కాకా వెంకటస్వామి ని గెలిపించుకున్నామని, వెంకటస్వామి పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలో ఎనలేని సేవలు చేశారని గుర్తు చేశారు. మంత్రి శ్రీధర్ బాబు ఆదేశాల ప్రకారం ఆయన నేతృత్వంలో పెద్దపల్లి ఎంపీగా గడ్డం వంశీకృష్ణ ని గెలిపించి తీరుతామని ధీమా వ్యక్తం చేశారు.

## మదర్ థెరిస్సా ఇంజనీరింగ్ కళాశాలలో ముగిసిన ఎంప్లాయబులిటీ స్కిల్స్ట్రైనింగ్

**సూర్య-పెద్దపల్లి రూరల్**



మదర్ థెరిస్సా ఇంజనీరింగ్ కళాశాలలో మూడు రోజుల స్కిల్ డెవలప్మెంట్ ట్రైనింగ్ లో భాగంగా టాస్క్ వారి ఆధ్వర్యంలో మహేంద్ర ప్రైడ్ క్లాస్ రూమ్ వారు ఎంప్లాయిబిలిటీ స్కిల్స్ అను అంశంపై మూడు రోజుల ట్రైనింగ్ సెషన్ బుధవారం ముగిసినది. ట్రైనర్ అమూల్య మాట్లాడుతూ విద్యార్థుల యొక్క అంకిత భావం క్రమశిక్షణ మరియు పట్టుదల తనను ఎంతగానో ఆకట్టుకున్నదని తెలియజేశారు. దీనికి గాను కళాశాల యాజమాన్యానికి, ప్రిన్సిపల్ మరియు అధ్యాపకులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టి. శ్రీనివాస్ మాట్లాడుతూ తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ అను సంస్థ విద్యార్థుల యొక్క నైపుణ్యాభివృద్ధిలో ఎంతగానో తోడ్పడుతుందని తెలియజేశారు. మహేంద్ర ప్రైడ్ క్లాస్ రూమ్ వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఇందులో భాగంగా కళాశాల అకౌంట్ అధికారి పి. పవన్ కుమార్, ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ అధికారి కన్నం వెంకటేశ్వర్లు వివిధ విభాగాధిపతులు అధ్యాపకులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## చలివేంద్రం ప్రారంభం.

**సూర్య కాల్వ శ్రీరాంపూర్**



కాల్వ శ్రీరాంపూర్ మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయం వద్ద బుధవారం తహసిల్దార్ జాహేద్ పాషా చలివేంద్రాన్ని ప్రారంభించారు. వేసవి కాలం దృష్ట్యా కార్యాలయానికి వచ్చే వారి దాహార్తి తీర్చాలని భావనతో చలివేంద్రాన్ని ప్రారంభించినట్లు ఆయన తెలిపారు. వేసవి కాలము ముగిసేంతవరకు చలివేంద్రాన్ని కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డి టి ధీరజ్ కుమార్, ఆర్ ఐ ఉదయ్ శ్రీ, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## బాబూ జగ్జీవన్ రామ్ నూతన జయంతి కమిటీ కార్యవర్గం

**సూర్య, హుజురాబాద్**



హుజురాబాద్ లో బాబు జగ్జీవన్ రామ్ 117 వ నూతన జయంతోత్సవ కమిటీ కార్యవర్గం బుధవారం ఎన్నికయ్యారు. గౌరవ అధ్యక్షులు గా వేల్పుల రత్నం, గౌరవ సలహాదారులుగా బత్తుల రాజలింగం, మోరే సతీష్, వేల్పుల ప్రభాకర్, అధ్యక్షులుగా రొంటాల సుమన్, ఉపాధ్యక్షులుగా ఎర్ర కుమార్, గాజుల సంపత్, ప్రధాన కార్యదర్శిగా మిడిదొడ్డి సుధాకర్, ప్రచార కార్యదర్శిగా డాక్టర్ తడికమళ్ళ శేఖర్, కార్యదర్శులుగా మిడిదొడ్డి రాజు, మొలుగు శ్రీధర్, రామగిరి సంపత్, కోశాధికారి గా కనకం వెంకటస్వామి, సాంస్కృతిక కార్యదర్శి గా రామ్ రాజేశ్వర్ లను ఎన్నుకున్నారు.

## ఉత్తర్వులు జారీచేసిన జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

**సూర్య వేములవాడ టౌన్**

జిల్లాలోని వేములవాడ పట్టణ పోలీస్ స్టేషన్ లో విధులు నిర్వర్తించిన ముగ్గురు కానిస్టేబుల్ సస్పెండ్ చేస్తూ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల అదే పోలీస్ స్టేషన్ లో విధులు నిర్వర్తించిన ఐదుగురు కానిస్టేబుళ్లు, ఐదుగురు హోంగార్డులు మొత్తం పదిమంది సిబ్బంది పలు అవినీతి ఆరోపణల నేపథ్యంలో ఏఆర్ హెడ్ క్వార్టర్స్ కి చేసిన విషయం తెలిసిందే. అంతేకాకుండా మరో పోలీసు ఉన్నతాధికారిని కూడా అటాచ్ చేసిన విషయం విధితమే. కాగా తాజాగా ఏఆర్ హెడ్ క్వార్టర్స్ కు అటాచ్ చేసిన సిబ్బందిలో శంకర్, అరుణ్, సురేష్ అనే ముగ్గురు కానిస్టేబుళ్లను బుధవారం జిల్లా ఎస్పీ సస్పెండ్ చేశారు. ముగ్గురు సిబ్బంది సస్పెన్షన్ జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. తరువాత ఇంకా ఎవరు సస్పెండ్ కానున్నారనే ఉత్కంఠ జిల్లా వ్యాప్తంగా కొనసాగుతోంది. ఏది ఏమైనప్పటికీ అవినీతి అధికారులు, సిబ్బందిపై ఉక్కు పాదం మోపుతున్న జిల్లా ఎస్పీపై జిల్లా ప్రజలు అభినందనల వర్షం కురిపిస్తున్నారు.

# సైబర్ వారియర్స్ తో ఆన్లైన్ నేరాలకు చెక్

## -సైబర్ నేరాల నియంత్రణ కోసం పోలీస్ స్టేషన్ వారిగా ప్రత్యేక ఫోన్ నంబర్లు -జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

**సూర్య రాజన్న సిరిసిల్ల**

సైబర్ నేరాలకు చెక్ పెట్టేందుకు జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్లలో సైబర్ నేరాల దర్యాప్తుపై ప్రత్యేక శిక్షణ పొందిన సైబర్ వారియర్స్ ను నియమించినట్లు జిల్లా ఎస్పీ అఖిల్ మహాజాన్ తెలిపారు. బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ అఖిల్ మహాజన్ సైబర్ వారియర్స్ కు ప్రత్యేక ఫోన్ నెంబర్లతో కూడిన సిమ్ కార్డులను అందజేసి ఆ నంబర్లను మీడియాకు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో ప్రతి పోలీస్ స్టేషన్కు ఒక్కో సైబర్ వారియర్ చొప్పున 13 మందిని నియమించడం జరిగిందన్నారు. సైబర్ వారియర్స్ గా శిక్షణ పొంది పోలీస్ స్టేషన్లో పనిచేసే సిబ్బందికి ప్రత్యేకంగా ఒక ఫోన్ నెంబర్ ఉంటుందని తెలియజేసారు. సైబర్ నేరాల బారిన పడిన ప్రజలు వెంటనే 1930 కి కాల్ చేయడం గానీ, %చీజ్రా% పోర్టల్ ద్వారా ఫిర్యాదు చేయడం గానీ చేయాలన్నారు. బాధితులు ఫిర్యాదులను నమోదు చేసుకుంటేనే గుర్తించడం సులువవుతుందని తెలియజేశారు. సైబర్ నేరాలకు గురైన బాధితులకు మెరుగైన సేవలు



అందించేందుకే సైబర్ వారియర్స్ ను పోలీస్ శాఖ తరపున ప్రతి పోలీస్ స్టేషన్లో నియమించడం జరిగిందని, సైబర్ నేరాల బారిన పడిన ఫిర్యాదు చేసిన బాధితుడికి సంబంధిత పోలీస్ స్టేషన్లో నియమింపబడిన సైబర్ వారియర్ ద్వారా తమ అప్లికేషన్ స్టేటస్ ను ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చున్నారు. సైబర్ నేరాల బాధితుల కోసం ఏర్పాటు చేసిన ఈ సౌకర్యాన్ని జిల్లా ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

**-పోలీస్ స్టేషన్ ల వారీగా సైబర్ వారియర్స్ ఫోన్ నంబర్స్**

1. సిరిసిల్ల టౌన్ పోలీస్ స్టేషన్. 8712657807.
2. తంగాలపల్లి పోలీస్ స్టేషన్. 8712657810.
3. ఇల్లంతకుంట పోలీస్ స్టేషన్. 8712657803.
4. ముస్తాబద్ పోలీస్ స్టేషన్. 8712657806.
5. ఎల్లారెడ్డిపేట్ పోలీస్ స్టేషన్. 8712657809.
6. గంభీరవుపేట్ పోలీస్ స్టేషన్. 8712657804.
7. వీర్నపల్లి పోలీస్ స్టేషన్. 8712657811.
8. వేములవాడ టౌన్ పోలీస్ స్టేషన్. 8712657808.
9. వేములవాడ రూరల్ పోలీస్ స్టేషన్. 8712657812.
10. బోయినపల్లి పోలీస్ స్టేషన్. 8712657801.
11. చందుర్తి పోలీస్ స్టేషన్. 8712657802.
12. కొనరావుపేట్ పోలీస్ స్టేషన్. 8712657805.
13. రుద్రాంగి పోలీస్ స్టేషన్. 8712657813.

# సాగు నీరందక రైతుల పంటలు ఎండిపోతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం సిగ్గుచేటు

**- సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి**

**సూర్య కరీంనగర్ ప్రతినిధి**



వేసవికాలం తీవ్రతరం అవుతున్న తరుణంలో ప్రజలకు త్రాగునీరుకు ఇబ్బందులు తలెత్తే ప్రమాదం ఉన్నదని, సాగు నీరందక రైతుల పంటలు ఎండిపోతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం సిగ్గుచేటని సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి పేర్కొన్నారు. బుధవారం కరీంనగర్ లోని సీపీఐ జిల్లా కార్యాలయం బద్దం ఎల్లారెడ్డి భవన్ లో జరిగిన విలేకరుల సమావేశంలో వెంకటస్వామి మాట్లాడుతూ గత ప్రభుత్వం చేసిన తప్పిదాల మూలంగా రాష్ట్రంలో దొరల పాలనను అంతమొందించడం కోసం, కేసీఆర్ నియంతృత్వ పరిపాలనపై ప్రజలంతా విసిగి వేసారిపోయి గత్యంతరం లేక కాంగ్రెస్ పార్టీకి అధికారం కట్టబెట్టారని అన్నారు. గత పది సంవత్సరాలుగా కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం అనేక రైతు వ్యతిరేక నల్ల చట్టాలను తీసుకువచ్చి రైతుల ఉసురు పోసుకుందని, కరీంనగర్ పార్లమెంటు సభ్యుడు బండి సంజయ్ కుమార్ రైతు దీక్ష చేస్తుంటే దయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉందని సంజయ్ రైతు దీక్ష రైతుల కోసమా? లేక రానున్న ఎన్నికల్లో ఓట్ల కోసమా? అనే అనుమానం కలుగుతుందని, కరీంనగర్ పార్లమెంటు నియోజకవర్గ అభివృద్ధి కోసం, రాష్ట్ర అభివృద్ధి కోసం ఎన్ని కోట్ల నిధులు తీసుకొచ్చావో చెప్పాలని, ప్రజల కోసం పనిచేయకుండా కేవలం మతం పేరు రాజకీయం చేస్తూ జైశ్రీరామ్ అని యువకులను రెచ్చగొట్టి పబ్బం గడుపుకుం టున్నవాని ఆరోపిస్తూ, రానున్న పార్లమెంటు ఎన్నికల్లో బిజెపిని ఓడించడానికి ప్రజలంతా సంసిద్ధం కావాలని వెంకటస్వామి పిలుపునిచ్చారు. ఈ విలేకరుల సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కొయ్యడ సృజన్ కుమార్, బోయిని అశోక్, కసిరెడ్డి సురేందర్ రెడ్డి, ఏ ఐ ఎస్ ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ రెడ్డి, సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు కటిక రెడ్డి బుచ్చన్న యాదవ్, పైడిపెల్లి రాజు, బ్రాహ్మణపల్లి యుగేందర్, బోనగిరి మహేందర్, మచ్చ రమేష్, రామరపు వెంకటేష్, సీపీఐ నాయకులు న్యాలపట్ల రాజు, చెంచల మురళి, కేషబోయిన రాము, కనకం నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# వేసవిలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**- జెడ్పీ చైర్ పర్సన్ దావ వసంతసురేష్**

**సూర్య జగిత్యాల**

ఏప్రిల్ నుండి జూన్ మధ్య జిల్లాలో చాలా వరకు సాధారణం కంటే ఎక్కువ ఉష్ణోగ్రతలు నమోదవుతాయని దాని దృష్ట్యా జిల్లా ప్రజలందరూ తగిన జాగ్రత్తలు పాటిస్తూ అప్రమత్తంగా ఉండాలని జగిత్యాల జెడ్పీ చైర్ పర్సన్ దావ వసంత సురేష్ తెలిపారు. జిల్లాలో ఈ ఏడాది అత్యంత వేడిగా ఉండే వేసవి, వడదెబ్బ నుండి జిల్లా ప్రజలకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై జిల్లా వైద్యాధికారి, జిల్లా విద్యాధికారి, డి పి వో లకు బుధవారం వర్చువల్ ఫోన్ కాన్ఫరెన్స్ లో పలు సూచనలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలిపారు. స్కూల్ విద్యార్థులను కాపాడుకోవాల్సిన బాధ్యత మనది కాబట్టి ప్రతి పాఠశాలలో ప్రార్థన సమయంలో పిల్లలకు వడ దెబ్బ తగల కుండా తీసుకోవా ల్సిన జాగ్రత్తలను వివరిం చవ ల్సిందిగా జిల్లా విద్యాధి కారికి ఆదేశించారు. జిల్లా లోని ఆశావర్కర్లు, ఏఎన్ఎం లందరూ వివిధ వ్యాధులతో బాధపడు తున్న వారికి ఈ వేసవిలో వడదెబ్బ వల్ల ఎక్కువగా ఇబ్బంది పాలవుతారు కనుక వారిని రక్షించే విధంగా రక్షణ చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రతి గ్రామంలో ఎండ తీవ్రతకు ఓ ఆర్ ఎస్ విశిష్ఠత, వైద్య పరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రతి ఒక్కరికీ వివరి స్తూ అవగాహన కార్యక్రమాలు నిర్వహించవలసిందిగా జిల్లా వైద్యాదికారికి ఆదేశించారు. ఉపాధిహామీ పనుల దగ్గర అదేవిధంగా కొనుగోలు కేం ద్రాల దగ్గర వారికి



అందు బాటులో నీళ్ళు, ఓ ఆర్ ఎస్ పాకెట్స్ అందుబాటులో ఉంచాలని జిల్లా పంచాయితీ అధికారికి ఆదేశించారు. రోడ్ల మీద దొరికే చిరుతిండ్లు, రంగు పానీయాలు తీసుకో కుండా ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి అని అన్నారు. ఉప్పు కలిపిన మజ్జిగ, గ్లూకోజ్ కలిపిన నీరు, ఓరల్ రీ హైడ్రేషన్ పండ్ల రసాలు, కొబ్బరినీళ్లు అదేవిధంగా ముఖ్యంగా పౌష్టికాహారం తీసుకోవాలి సూచించారు.

# బాబూ జగ్జీవన్ రామ్ నూతన జయంతి కమిటీ కార్యవర్గం

**సూర్య, హుజురాబాద్**



హుజురాబాద్ లో బాబు జగ్జీవన్ రామ్ 117 వ నూతన జయంతోత్సవ కమిటీ కార్యవర్గం బుధవారం ఎన్నికయ్యారు. గౌరవ అధ్యక్షులు గా వేల్పుల రత్నం, గౌరవ సలహాదారులుగా బత్తుల రాజలింగం, మోరే సతీష్, వేల్పుల ప్రభాకర్, అధ్యక్షులుగా రొంటాల సుమన్, ఉపాధ్యక్షులుగా ఎర్ర కుమార్, గాజుల సంపత్, ప్రధాన కార్యదర్శిగా మిడిదొడ్డి సుధాకర్, ప్రచార కార్యదర్శిగా డాక్టర్ తడికమళ్ళ శేఖర్, కార్యదర్శులుగా మిడిదొడ్డి రాజు, మొలుగు శ్రీధర్, రామగిరి సంపత్, కోశాధికారి గా కనకం వెంకటస్వామి, సాంస్కృతిక కార్యదర్శి గా రామ్ రాజేశ్వర్ లను ఎన్నుకున్నారు.

# దాడిలో ఒకరికి గాయాలు

**సూర్య, కాల్వ శ్రీరాంపూర్**

కాల్వ శ్రీరాంపూర్ మండలం తారుపల్లి గ్రామానికి చెందిన బాసిరి మోహన్ కు పాలివాళ్లతో జరిగిన గొడవల్లో గాయాలైనట్లు కాల్వ శ్రీరాంపూర్ ఎస్సై ఓంకార్ యాదవ్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం బాసిరి మోహన్ కు అదే గ్రామానికి చెందిన పాలివాళ్లయిన బాసిరి అంజయ్యతో ఇంటిముందు త్రోవ విషయంలో గొడవలు జరుగుతుండేవి. బాసిరి అంజయ్య ఇంటి ముందుకు ఈనెల 2 న దాసరి మోహన్ కోళ్లు వెళ్లగా అది దృష్టిలో పెట్టుకొని దాసరి అంజయ్య బూతు మాటలు తిట్టాడు. అతనిని పక్క వాళ్ళు వారించగా అది మనసులో పెట్టుకుని హైదరాబాదులో ఉన్న తన తమ్ముళ్లు సంపత్, సురేష్ లను పిలిపించి ఆ కారణంగా మోహన్ ఇంటిలో చొరబడి సైకిల్ గాలి పంపు, బ్యాటు, కర్రలతో దాడి చేయగా తలకు గాయమై రక్తస్రావం జరిగింది. ఈ మేరకు మోహన్ భార్య జ్యోతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఓంకార్ యాదవ్ వివరించారు.

# వికలాంగులకు రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలి

**- మాజీ సింగల్విండో డైరెక్టర్ నాగినేని జగదీశ్వర్ రావు**

**సూర్య, ముత్తారం**

స్థానిక సంస్థల నుంచి చట్టసభల వరకు రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలని మంథని నియోజక వర్గంలోని ముత్తారం గ్రామం మాజీ సింగల్విండో డైరెక్టర్ నాగినేని జగదీశ్వర్ రావు అన్నారు. బుధవారం ముత్తారం ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వికాలంగులకు రాజకీయ రిజర్వేషన్లు కల్పించినప్పుడే వారి పక్షాన ప్రశ్నించే గొంతుకు నాంది పలికే అవకాశం ఉంటుందన్నారు. అలాగే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ సంక్షేమ పథకాల్లో 5శాతం వికలాంగులకు కేటాయించి అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం 2024 లెక్కల ప్రకారం భారతదేశంలో సుమారు 15శాతం దివ్యాంగ కుటుంబాలు ఉండగా అందులో 10కోట్లకు పైగా ఓటర్లు ఉన్నట్లు ప్రభుత్వ గణాంకాలు తెలియజేస్తున్నాయి అన్నారు. వికలాంగులకు అన్నిరంగాల్లో సమాన అవకాశాలు కల్పించేందుకు ప్రత్యేక రిజర్వేషన్లు ప్రవేశపెట్టాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

# ఎంపీ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీని చిత్తుగా ఓడిస్తాం

**సూర్య, ముస్తాబాద్**

మొన్న జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యేలు గా గెలిచిన మాదిగ బిడ్డలకు అన్యాయము జరిగిందని, ఏ ఒక్కరికి మంత్రి పదవి ఇవ్వకపోవడం, చాలా బాధాకరమని మాదిగ రాష్ట్ర దళిత నాయకుడు కొమ్మేట రాజు అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో పనిచేసే మాల ఎమ్మెల్యే నాయకులకే మంత్రి పదవులు, స్పీకర్ పదవులు ఇవ్వడము, కాంగ్రెస్ పార్టీలో పనిచేసే మాదిగలకు ఒక్క మంత్రి పదవి ఇవ్వకపోవడం చాలా బాధాకరమని, జరగబోయే పార్లమెంట్ ఎన్నికలలో కూడా మాదిగలకు ఎంపీ సీట్లు కేటాయించకపోవడం మాదిగలపై కక్ష్య సాధింపు దిశగా కాంగ్రెస్ పార్టీ సీఎం రేవంత్ రెడ్డి సర్కార్ పనిచేస్తుందని, ఎస్సీ రిజర్వుడు స్థానాలు ఒకే మాల సామాజిక వర్గానికి మూడు ఎంపీ సీట్లు కేటాయించడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాము. రాష్ట్రవ్యాప్తంగా మాల జనాభా కంటే మాదిగల జనాభా సంఖ్య ఎక్కువ, మాదిగల%శీ%తా ఏకమై ఎంపీ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీకి ఓటుతో సరైన బుద్ధి చెప్తామని, ప్రతి జిల్లా, మండల కేంద్రానికి, గ్రామగ్రామాన తిరిగి కాంగ్రెస్ పార్టీ నుంచి నిలబడ్డా ఎంపీ అభ్యర్థిని చిత్తుచిత్తుగా ఓడిస్తామని ఈ సందర్భంగా వారు అన్నారు.